


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 77 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా బుధవారం 28 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 77 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST WED 28 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# పనితీరు బాగోకపోతే పదవులు ఊడతాయి

## నేతలకు చంద్రబాబు వార్నింగ్



- పార్టీ కంటే ఏదీ ముఖ్యం కాదు.. నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదన్న చంద్రబాబు
- పదవులు పొందిన నేతల పనితీరుపై ప్రతి 3 నెలలకోసారి సమీక్ష
- జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని దిశానిర్దేశం
- అధికారాన్ని నిలబెట్టుకోవడం అందరి బాధ్యత అని నేతలకు సూచన
- గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై తీవ్ర విమర్శలు

**పెన్ పవర్ డెస్క్:**పార్టీ కంటే ఏదీ ముఖ్యం కాదని, ఏ నాయకుడైనా సరే నిర్లక్ష్యం వహించినా, వివాదాలు సృష్టించినా పక్కనబెట్టడానికి వెనుకాడబోనని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. అధికారం వచ్చిందన్న భావనతో ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్లమెంట్ కమిటీల వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు."పార్టీలో పదవులు పొందిన వారి పనితీరును ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తాను. సరిగా పనిచేయకపోతే వారిని తప్పించి, మరొకరికి అవకాశం కల్పిస్తాను. పార్టీలో తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా నేతలు, కార్యకర్తల్లో కూడా మార్పు రావాలి. వచ్చిన అధికారాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని చంద్రబాబు స్పష్టం చేశారు. పొలిటికల్ గవర్నెన్స్‌లో పార్లమెంట్ కమిటీలు కీలకమని, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు కూడా పార్లమెంట్ అధ్యక్షులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలతో కలిసికట్టుగా పనిచేయాలని, 2024 ఎన్నికల్లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే మరో పది ఓట్లు అదనంగా వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు

- మిగతా 2లో...



## టీడీపీ వర్క్‌షాప్... కార్యకర్తల మధ్యలో కూర్చున్న చంద్రబాబు

- టీడీపీ పార్లమెంట్ కమిటీల వర్క్‌షాప్‌లో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- నాయకులతో కలిసి కూర్చుని శిక్షణ పొందిన అధినేత
- కార్యకర్తే పార్టీకి అధినేత అని మరోసారి చాటిచెప్పిన వైనం
- పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ పథకాలపై 1050 మందికి శిక్షణ
- చంద్రబాబు నిరాడంబరత స్ఫూర్తిదాయకమన్న నేతలు, కార్యకర్తలు

- మిగతా 2లో...

## ఏపీకి రానున్న రాహుల్ గాంధీ... షర్మిల ఆహ్వానానికి గ్రీన్ సిగ్నల్



- ఢిల్లీలో రాహుల్ గాంధీతో సమావేశమైన ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల
- ఉపాధి హామీ పరిరక్షణ ఉద్యమంలో పాల్గొనాలని రాహుల్‌కు ఆహ్వానం
- షర్మిల విజ్ఞప్తికి సానుకూల స్పందన... ఏపీకి వస్తానని రాహుల్ హామీ
- వైఎస్సార్ పథకాన్ని ప్రారంభించిన బండ్లపల్లి నుంచే ఉద్యమం ప్రారంభం

- మిగతా 2లో...



## ఢిల్లీలో చారిత్రక ఘట్టం..

### భారత్-ఈయూ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' ఖరారు

- భారత్, యూరప్ సమాఖ్య మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు
- 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించిన ఈయూ కమిషన్ అధ్యక్షురాలు
- 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత తుది రూపం
- భారత్ నుంచి 97 శాతం ఎగుమతులపై సుంకాల రద్దు
- వచ్చే ఏడాది నుంచి ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం

- మిగతా 2లో...



## మేము సూపర్‌పవర్‌గా మారాలంటే భారత్‌తో వ్యాపారం చేయాల్సిందే

- అత్యంత కీలకమైన ఇంధన మార్కెట్‌లలో ఒకటిగా భారత్ అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్య
- కెనడా సూపర్ పవర్ కావాలంటే భారత్‌తో వ్యాపారం చేయాలన్న మంత్రి టిమ్ హాడ్గ్‌సన్
- ముడిచమురు, సహజ వాయువుల రవాణాకు కెనడా సిద్ధంగా ఉందన్న ఆ దేశ మంత్రి

- మిగతా 2లో...



## ముగిసిన హల్వా వేడుక...

### బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు వాళ్లు బయటికి రారు!

- కేంద్ర బడ్జెట్ 2026-27 తయారీలో ముగిసిన హల్వా వేడుక
- ఈ వేడుకతో ప్రారంభమైన బడ్జెట్ అధికారుల 'లాక్-ఇన్' పీరియడ్
- ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- మొబైల్ యాప్‌లోనూ అందుబాటులో ఉండనున్న బడ్జెట్ పత్రాలు
- ప్రసంగం పూర్తయ్యాకే యాప్‌లో బడ్జెట్ వివరాలు వెల్లడి

- మిగతా 2లో...

కేంద్ర బడ్జెట్ 2026-27 రూపకల్పన ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. ఏటా బడ్జెట్ తయారీలో చివరి ఘట్టానికి సూచనగా నిర్వహించే సంప్రదాయ 'హల్వా వేడుక' మంగళవారం నాడు ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో ఉన్న బడ్జెట్ ప్రెస్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి హాజరయ్యారు. బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ముగింపు దశకు వచ్చిందని, ఇక ప్రింటింగ్ ప్రారంభమవుతుందని ఈ వేడుక సంకేతాన్నిస్తుంది. ఈ వేడుక ముగిసిన వెంటనే బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న కీలక అధికారులు 'లాక్-ఇన్' పీరియడ్‌లోకి వెళతారు. ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే వరకు వీరంతా బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధాలు లేకుండా పూర్తి ఏకాంతంగా గడుపుతారు. ఫోన్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలకు కూడా దూరంగా ఉంటారు. బడ్జెట్‌కు సంబంధించిన అత్యంత కీలకమైన,

## దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె... స్తంభించిన సేవలు




- వారానికి 5 రోజుల పనిదినాల కోసం దేశవ్యాప్త సమ్మె
- ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్
- యూఎఫ్‌బీయూ పిలుపుతో నిరసన బాట పట్టిన ఉద్యోగులు

- మిగతా 2లో...

## జోగి రమేశ్ ను కలిసిన కేతిరెడ్డి... కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

- ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతున్నందుకు జోగి రమేశ్ ను జైల్లో పెట్టారన్న కేతిరెడ్డి
- ప్రభుత్వ తప్పిదాలపై రమేశ్ పోరాటం చేస్తూనే ఉంటారని వ్యాఖ్య
- తనపై ఉన్న కేసును కొట్టేయించుకోవాలని చంద్రబాబు చూస్తున్నారని విమర్శ



మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రామును తప్పుడు కేసులతో అరెస్ట్ చేశారని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈరోజు ఆయన జోగి రమేశ్ ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తప్పులను ఎత్తిచూపుతున్నందుకు 83 రోజులు జైల్లో పెట్టారని, చంద్రబాబు సర్కార్ వచ్చిన తర్వాత తప్పుడు కేసులు పెట్టి అందరినీ ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు.

- మిగతా 2లో...



## పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు

### టీడీపీ శ్రేణులకు మంత్రి లోకేశ్ దిశానిర్దేశం

- రాష్ట్ర అభివృద్ధికి కనీసం 15 ఏళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలని సూచన
- పార్టీ నేతలు అలక వీడి, ఐక్యంగా పనిచేయాలని పిలుపు
- శిక్షణ తరగతుల్లో నిత్య విద్యార్థిలా వెనుక కూర్చుని పాఠాలు విన్న లోకేశ్
- యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో వేడుకలు

- మిగతా 2లో...



## పడిపోతున్న డాలర్.. నిలకడగా రూపాయి

- ప్రపంచ మార్కెట్లో బలహీనపడుతున్న అమెరికా డాలర్
- డాలర్‌తో పోలిస్తే రూ.90 వద్ద స్థిరంగా భారత రూపాయి
- భారత్‌లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరిగే అవకాశం
- అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల కోత అంచనాలతో డాలర్‌పై ఒత్తిడి

- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

# నిశ్శబ్ద ఆరోగ్య సంక్షోభంలో భారతం

భారత దేశం నిశ్శబ్ద ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. నిశ్చల జీవనశైలి, జన్యుశాస్త్ర కారణాలతో పాటు మనం తీసుకునే ఆహార పదార్థాల వల్ల 'ఇన్సులిన్ నిరోధకత(ఇన్సులిన్ రెసిస్టెన్స్), జీవక్రియ సిండ్రోమ్ (మెటబాలిక్ సిండ్రోమ్) లక్షణాలు కనిపిస్తాయి. మన సాధారణ ఆహారంలో అధికంగా రొట్టెలు, బియ్యపు అన్నం తినడం, బంగాళాదుంపలు తీసుకోవడం, సమోసాలు/బజ్జీలు/బిస్కెట్లు నమలడం, చక్కెరలతో కూడిన శీతల పానీయాలు తాగడం, మైదా పదార్థాలు తీసుకోవడం, బర్గర్ ఫిజ్జాలు ఇష్టపడడం, స్నాక్స్ నమలడం, స్వీట్లు తినడం లాంటివి తీసుకోవడంతో భారతీయులకు జీవక్రియ సంబంధ అనారోగ్యాలు అధికంగా బయట పడుతున్నాయి. దీని ఫలితంగా భారతదేశం "మధుమేహ కేంద్రంగా భారత్" లేదా "డయాబెటిస్ క్యాపిటల్ ఆఫ్ వరల్డ్"గా కీర్తించబడుతున్నది. శరీర కణాలు క్లోమం ఉత్పత్తి చేసే ఇన్సులిన్ హార్మోన్‌కు తక్కువ స్పందన చూపినపుడు ఇన్సులిన్ నిరోధకత ఏర్పడుతుంది. కండరాలు, కాలేయం, కొవ్వు లాంటి శరీర కణజాలాలు ఇన్సులిన్‌కు స్పందించనపుడు, రక్తంలో కణాల్లోకి సులభంగా గ్లూకోజ్ చేరడం జరుగదు. దీని వల్ల క్లోమ గ్రంథి (ప్యాంక్రియాస్) అదనంగా ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తూ చివరకు ఆ హార్మోన్ సరిపోక రక్తంలో షుగర్ లెవల్స్ పెరిగి టైప్ – 2 మధుమేహం బయట పడుతుంది. ఇలాంటి అవాంఛనీయ పరిస్థితిని "ఇన్సులిన్ నిరోధకత (ఇన్సులిన్ రెసిస్టెన్స్)" అని, ఇది ఒక ప్రమాదకర జీవక్రియ రుగ్మతగా మారుతుంది. దీనినే "జీవక్రియ ఆరోగ్య సంక్షోభం (మెటబోలిక్ హెల్త్ క్రయసిస్)" అని పిలుస్తున్నాం. ఈ రుగ్మత వల్ల నిద్రలేమి, అలసట, బలహీనత, అధిక దాహం, , ఏకాగ్రత లోపం, దృష్టి కేంద్రీకరించడంలో ఇబ్బందులు, ఆకలి పెరగడం లాంటి లక్షణాలు అధికంగా కనిపిస్తాయి. ఈ విధమైన జీవక్రియ సంక్షోభం ఫలితంగా డయాబెటిస్‌తో పాటు ఊబకాయం (ఒబేసిటీ), గుండె జబ్బులు, స్త్రీలో హార్మోన్ల అసమతుల్యత, కాలేయ వ్యాధి (నాన్–ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ డిసీజ్) లాంటి ప్రాణాంతక అనారోగ్యాలు కలుగుతాయి. అధిక బరువు ఉండడం, కాలేయం/బొడ్డు కొవ్వు పెరగడం, శారీరక శ్రమ లేకపోవడం, నిష్క్రియాత్మక జీవన శైలి అలవడడం, అధిక మానసిక ఒత్తిడి గుప్పిట్లో చిక్కడం లాంటి కారణాల వల్ల జీవక్రియ ఆరోగ్య సంక్షోభానికి లేదా ఇన్సులిన్ నిరోధకతకు దారి తీస్తుంది. ఇన్సులిన్ నిరోధకత నివారణకు ప్యాకెట్ ప్రాసెస్డ్ ఫుడ్స్, నిలువ ఉంచిన ఆహారం, జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్, కృత్రిమ చక్కెరలు, తీపి పాల ఉత్పత్తులు, రుచి కలిగిన పెరుగు, వేపుడు ఆహారం, చక్కెర పానీయాలకు దూరంగా చక్కటి ఆరోగ్యకర ఆహార అలవాట్లను పాటించాలి. ప్రతి రోజు క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాలి. శరీర బరువును తగ్గించుకోవడం, మానసిక ఒత్తిడికి ఆస్కారం ఇవ్వకపోవడం, నిద్రకు తగిన సమయం కేటాయించడం లాంటి జీవనశైలి మార్పులను పాటించాలి. ఆకు కూరలు, తృణధాన్యాలు, చిక్కుళ్ళు, కొవ్వు చేపలు, తగినంత ప్రోటీన్ ఆహారం, దాల్చిన చెక్క, సుగంధ ద్రవ్యాలు తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. డిజిటల్ యుగపు యువత అసాధారణ జీవనశైలి, అవాంఛనీయ ఆహారపు అలవాట్లతో క్రమంగా జీవక్రియ ఆహార సంక్షోభం వైపు పయనిస్తున్నారు. దీని వల్ల తిరిగి కోలుకోలేని టైప్–2 మధుమేహం బారిన పడడం జరుగుతున్నది. ఈ విషయాల గంభీరతను దృష్టిలో పెట్టుకొని తమ తమ జీవనశైలిల్లో సకారాత్మక మార్పులు చేసుకుంటూ డయాబెటెస్‌కు దూరంగా ఆరోగ్యకర జీవితాలను అనుభవిద్దాం. జీవక్రియ సిండ్రోమ్ లేదా సంక్షోభానికి చరమ గీతం పాడుదాం.

## టీడీపీ వర్క్‌షాప్... కార్యకర్తల మధ్యలో
# కూర్చున్న చంద్రబాబు

నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినా, తెలుగుదేశం పార్టీలో మాత్రం తాను ఒక సామాన్య కార్యకర్తనే అని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి చాటిచెప్పారు. అధికారిక హోదాలు, ప్రోటోకాల్ పక్కనపెట్టి, పార్టీ ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో ఆయన కార్యకర్తల మధ్యలో కూర్చుని నాయకులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన పార్లమెంట్ కమిటీల వర్క్‌షాప్‌లో ఆయన నిరాడంబరత అందరినీ ఆశ్చర్యపరిచింది, స్ఫూర్తినింపింది.

మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో 25 పార్లమెంట్ కమిటీల కోసం తెలుగుదేశం పార్టీ ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఒక్కో కమిటీ నుంచి 42 మంది చొప్పున మొత్తం 1,050 మంది సభ్యులు ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ వర్క్‌షాప్‌లో సీఎం చంద్రబాబుతో పాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ జరుగుతున్న వివిధ గదుల్లోకి స్వయంగా వెళ్లిన చంద్రబాబు, అక్కడి నాయకులు, కార్యకర్తల మధ్యలో కూర్చుని వారితో మమేకం అయ్యారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు నూతన పార్లమెంట్ అధ్యక్షులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతిలోనూ ఆయన సాధారణ సభ్యుడిలా హాజరై, నేతలు చెప్పే విషయాలను శ్రద్ధగా విన్నారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి తమతో పాటు కూర్చోవడంతో అక్కడున్న నాయకులు, కార్యకర్తలు మొదట ఆశ్చర్యానికి గురయ్యారు. ఆయన చూపిన చొరవ, నిబద్ధత తమలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని వారు అభిప్రాయపడ్డారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి 'కార్యకర్తే అధినేత' అనే సిద్ధాంతాన్ని నమ్ముతామని, దానికి అనుగుణంగానే తాను ఈ కార్యక్రమంలో పాల్గొన్నానని చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, నాలుగున్నర దశాబ్దాల ప్రయాణం, క్యాడర్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై ఆయన నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ వర్క్‌షాప్‌లో కూటమి ప్రభుత్వ విజయాలు, భవిష్యత్ ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలు, విజన్ ప్లాన్‌లపై కూడా సభ్యులకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఉదయం నుంచి పార్టీ కార్యాలయంలోనే ఉన్న నారా లోకేశ్ కూడా ప్రతి బృందం సభ్యులతోనూ ముచ్చటించారు. చంద్రబాబు తన హోదాను పక్కనపెట్టి సామాన్య కార్యకర్తగా ఒదిగిపోయిన విధానం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ ఘటన పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

### పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. పార్టీ అనేది సొంతిల్లు వంటిదని, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిదని అభివర్ణించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నూతనంగా నియమితులైన పార్లమెంట్ కమిటీల కోసం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేశ్ పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు.

పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీ కార్యాలయానికి తగిన సమయం కేటాయించాలని లోకేశ్ సూచించారు. "పార్టీ మన సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిది. చంద్రబాబు గారికి ఎంత పని ఒత్తిడి ఉన్నా వారానికి ఒకసారి పార్టీ ఆఫీసుకు వచ్చి కార్యకర్తలను కలుస్తున్నారు, శిక్షణ కార్యక్రమాలకు హాజరవుతున్నారు" అని గుర్తుచేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉందని, కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసికట్టుగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. కేంద్ర సహకారంతోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగామని, అమరావతి, పోలవరం పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ కూడా తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

**అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం**

పార్టీ నాయకులు చిన్న చిన్న అలకలు వీడి ఐక్యంగా పనిచేయాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మనపై ఎన్నో అక్రమ కేసులు పెట్టారు. ఇప్పుడు అలకల వల్ల మనమే నష్టపోతాం. ఏదైనా సమస్య ఉంటే పార్టీలోనే పోరాడాలి" అని హితవు పలికారు. కనీసం 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగితేనే రాష్ట్రాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసుకోగలమని పవన్ కల్యాణ్ కూడా చెప్పారని గుర్తుచేశారు. కూటమిలో చిన్న చిన్న సమస్యలు సహజమని, వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగాలన్నారు. మన మధ్య విభేదాలు సృష్టించడానికి వైసీపీ ప్రయత్నిస్తుందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

# పనితీరు బాగోకపోతే పదవులు ఊడతాయి

- మొదటి పేజి తరువాయి

చేసి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. "ప్రజల భూముల పట్టాదారు పాసుపుస్తకాలపై, పొలం సరిహద్దు రాళ్లపై కూడా వాళ్ల ఫొటోలు ముద్రించుకున్నారు. చరిత్రలో ఎప్పుడైనా ఇలా జరిగిందా? ప్రజల ఆస్తుల జుట్టు వాళ్ల చేతుల్లో పెట్టుకుని ఆడించాలని చూశారు. అందుకే ఆ లోపభూయిష్టమైన చట్టాన్ని రద్దు చేశాం. ఏడాదిలోగా మళ్లీ సర్వేలు చేసి, ఎలాంటి సమస్యలు లేని పట్టాదారు పుస్తకాలు అందిస్తాం" అని హామీ ఇచ్చారు. అమరావతి విషయంలో గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడిందని, ఇప్పుడు మళ్లీ తాము రాజధానికి జీవం పోశామని అన్నారు. అమరావతే ఏకైక రాజధాని అని స్పష్టం చేస్తూనే, అన్ని ప్రాంతాల అభివృద్ధి తమ ధ్యేయమని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని పునరుద్ఘాటించారు. భోగాపురం విమానాశ్రయంలో 500 ఎకరాలు కొట్టేయాలని చూశారని, పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని ఆరోపించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని ఎద్దేవా చేశారు.

**కార్యకర్తే అధినేత.. వారికి అండగా ఉండాలి**

పార్టీలో కార్యకర్తే అధినేత అని, వారికి న్యాయం జరిగినప్పుడే పార్టీ శాశ్వతంగా ఉంటుందని చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్లలో కార్యకర్తలు ఎన్నో కష్టాలు పడ్డారని, పసుపు జెండా కోసం రక్తం చిందించారని గుర్తుచేశారు. "ఏ పని జరిగినా కార్యకర్తలకు గుర్తింపు ఉండాలి. నాయకులెవరూ కేడర్‌ను విస్మరించవద్దు. వారితో నిరంతరం అనుసంధానమై ఉండాలి" అని ఎమ్మెల్యేలు, ఎంపీలకు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. "మనం చేసే పనులు ఎంత ముఖ్యమో, మనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టడం కూడా అంతే ముఖ్యం. సోషల్ మీడియాలోనే కాదు, మౌత్ టు మౌత్ పబ్లిసిటీతో ప్రజలకు వాస్తవాలు వివరించాలి," అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సూపర్ 6 హామీలను సూపర్ హిట్ చేశామని, డీఎస్సీ, పోలీస్ ఉద్యోగాల భర్తీతో పాటు రోడ్ల మరమ్మతులు వేగవంతం చేశామని వివరించారు. రాబోయే అన్ని ఎన్నికల్లోనూ కూటమి గెలిచేలా ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని కోరారు.

## ఢిల్లీలో చారిత్రక ఘట్టం.. భారత్-ఈయూ
# 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' ఖరారు

భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఖరారైంది. 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత కుదిరిన ఈ ఒప్పందాన్ని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. ఈరోజు న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా, కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టాలతో జరిగిన 16వ శిఖరాగ్ర సమావేశంలో ఈ ఒప్పందాన్ని అధికారికంగా ఖరారు చేశారు. ఈ ఒప్పందం ద్వారా భారత్ నుంచి జరిగే 97 శాతం ఎగుమతులపై సుంకాలు రద్దు కానున్నాయి. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, రత్నాలు, లెదర్ వంటి రంగాలకు ఇది భారీ ఊతాన్ని ఇవ్వనుంది. అదే సమయంలో యూరప్ కార్లు, యంత్ర పరికరాలకు భారత మార్కెట్‌లోకి ప్రవేశం సులభతరం అవుతుంది. "ఈరోజు యూరప్, భారత్ చరిత్ర సృష్టిస్తున్నాయి. మేం 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'ను ముగించాం. ఇరుపక్షాలకు ప్రయోజనం చేకూర్చేలా 200 కోట్ల మంది ప్రజలతో స్వేచ్ఛా వాణిజ్య క్షేత్రాన్ని సృష్టించాం" అని ఉర్సులా 'ఎక్స్' వేదికగా తెలిపారు.

ఈ ఒప్పందం రెండు ప్రపంచ దిగ్గజాల మధ్య భాగస్వామ్యానికి చక్కటి ఉదాహరణ అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వాణిజ్యంతో పాటు రక్షణ, భద్రత, వాతావరణ మార్పులు, కీలక సాంకేతికతలు వంటి అంశాలపై కూడా ఇరుపక్షాలు దృష్టి సారించాయి. అమెరికా, చైనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, ఇతర ప్రాంతాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని చూస్తున్న ఐరోపాకు ఈ ఒప్పందం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ఒప్పందం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

# మేము సూపర్‌పవర్‌గా మారాలంటే భారత్‌తో వ్యాపారం చేయాల్సిందే

భారత పర్యటనలో ఉన్న కెనడా ఇంధన, సహజ వనరుల మంత్రి టిమ్ హాడ్గ్‌సన్ ఇరు దేశాల మధ్య వ్యాపార సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ఇంధన మార్కెట్‌లలో ఒకటిగా ఎదుగతోందని, ఈ నేపథ్యంలో ఇంధన రంగంలో కెనడా అగ్రగామిగా నిలవాలంటే భారత్‌తో వ్యాపారం చేయడం ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. గోవాలో జరుగుతున్న భారత ఇంధన వారోత్సవాలకు కెనడా మంత్రి టిమ్ హాడ్గ్‌సన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇరు దేశాల ఇంధన సహకారానికి ఈ వారోత్సవాలు ఒక మంచి వేదికని అన్నారు. భారత్, కెనడా మధ్య వాణిజ్య సంబంధాలను, ఇంధన వ్యాపారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. చమురు, గ్యాస్ వాణిజ్యాన్ని విస్తరించడానికి ఒట్టావా నుంచి భారత్‌కు ముడిచమురు, పెట్రోలియం, సహజ వాయువులను రవాణా చేయడానికి కెనడా సంసిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. అంతకుముందు టిమ్ హాడ్గ్‌సన్ 'ఎక్స్' వేదికగా తన భారత పర్యటన గురించి స్పందిస్తూ, భారత్‌లో జరుగుతున్న ఇంధన వారోత్సవాల్లో పాల్గొనడం తన తొలి పర్యటన అని పేర్కొన్నారు. కాగా, వాణిజ్యం, కీలక ఖనిజాలు, ఇంధనం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించే దిశగా భారత్, కెనడా అడుగులు వేస్తున్నాయి. ఇందులో భాగంగా వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. కెనడా వాణిజ్య మంత్రితో చర్చల అనంతరం భారత పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య పలు వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. హైడ్రోజన్, బయో ఇంధనాలు, బ్యాటరీ నిల్వ, కీలకమైన ఖనిజాలు, విద్యుత్ వ్యవస్థలు, ఇంధన పరిశ్రమలో కృత్రిమ మేధస్సు వినియోగం వంటి అంశాలపై దృష్టి సారించినట్లు ఆయన వెల్లడించారు. 2050 నాటికి ప్రపంచ ఇంధన డిమాండ్‌లో భారత్ వాటా 30 శాతం నుంచి 35 శాతానికి పెరుగుతుందని అంచనా వేయగా, తద్వారా భారత్ మూడవ అతిపెద్ద ఇంధన మార్కెట్‌గా అవతరిస్తుందని ఆయన అన్నారు.

# ముగిసిన హల్వా వేడుక...

- మొదటి పేజి తరువాయి

రహస్య సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు దశాబ్దాలుగా ఈ కఠిన నిబంధనను పాటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌదరి అధికారులకు హల్వాను వడ్డించి, శుభాకాంక్షలు తెలిపారు. హల్వా వేడుక అనంతరం నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రెస్‌ను సందర్శించారు. అక్కడ బడ్జెట్ పత్రాల ముద్రణకు సంబంధించిన తుది ఏర్పాట్లను సమీక్షించారు. బడ్జెట్ రూపకల్పన, ముద్రణ పనుల్లో నిమగ్నమైన సిబ్బందికి, అధికారుల బృందానికి ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ తయారీ ప్రక్రియతో సంబంధం ఉన్న ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

**డిజిటల్ రూపంలో బడ్జెట్ పత్రాలు**

గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న విధానాన్ని కొనసాగిస్తూ, ఈసారి కూడా బడ్జెట్ పత్రాలన్నీ ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేందుకు డిజిటల్ రూపంలో విడుదల చేయనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వార్షిక ఆర్థిక నివేదిక (బడ్జెట్), పద్దుల కేటాయింపులు (డిమాండ్ ఫర్ గ్రాంట్స్), ఆర్థిక బిల్లు వంటి కీలక పత్రాలన్నీ 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్'

ద్వారా లభిస్తాయి. పార్లమెంటు సభ్యులు, సాధారణ ప్రజలు ఈ యాప్ ద్వారా బడ్జెట్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లపై అందుబాటులో ఉంది. అలాగే, అఅనఙఎబన్త్రవ్.త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా కూడా పత్రాలను యాక్సెస్ చేయవచ్చు. అయితే, ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే ఈ పత్రాలు యాప్‌లో, వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# జోగి రమేశ్ ను కలిసిన కేతిరెడ్డి... కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

"జోగి రమేశ్ ను కలిసేందుకు ఆసుపత్రికి వెళ్లిన కుటుంబ సభ్యులపైనా కేసు పెట్టారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఎలా ఉందో అంతా చూస్తున్నారు. మర్డర్లు చేసిన వారిపై కేసు పెట్టడం లేదు. కోడిని, గొర్రెలను కోసిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారు. అక్రమంగా జైళ్లకు పంపిస్తే రెట్టించిన ఉత్సాహంతో మావాళ్లు పనిచేస్తారు. కూటమి ప్రభుత్వం తప్పిదాలపై జోగి రమేశ్ పోరాటం చేస్తూనే ఉంటారు" అని కేతిరెడ్డి అన్నారు. "ధర్మవరంలో 70 శాతం కల్తీ మద్యం దొరుకుతోంది. కల్తీ మద్యం తయారు చేసేది నీ జిల్లా నుంచే చంద్రబాబు. బెల్టుషాపులు లేకుండా చేస్తానన్నావ్. కానీ ఇప్పుడు ఊరికి నాలుగు బెల్టు షాపులు ఉన్నాయి. వేలంపాటలో బెల్ట్ షాపులు పాడుకుంటున్నారు. గిట్టుబాటు కావడం కోసం కల్తీ మద్యం అమ్ముతున్నారు. కొన్ని రోజుల క్రితం కడప జిల్లాలో ఇద్దరు చనిపోయారు. మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్స్ కింద తనపై ఉన్న కేసును కొట్టేయించుకోవాలని చంద్రబాబు చూస్తున్నాడు. చంద్రబాబుపై ఉన్న కేసులను మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్స్ అని ఎలా తొలగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. "చట్టం అందరికీ ఒకటే. కేసులు తీసేయించుకోవాలని చూస్తున్న ప్రయత్నంపై అప్పీల్‌కు వెళతాం. మద్యం సీసాలపై క్యూఆర్ కోడ్ మేం అధికారంలో ఉన్నప్పుడే తెచ్చాం. మంచి మద్యం ఇస్తానని చంద్రబాబు చెబితే అందరూ ఈలలు వేశారు. మంచి విద్య, వైద్యం ఇస్తామని జగన్ చెప్పితే ఎవరూ చప్పట్లు కొట్టలేదు. నేను ఇది చేశానని చెప్పి గడప గడపకు వెళ్లాలంటే ధైర్యం కావాలి. జగన్ ఎమ్మెల్యేలందరినీ ప్రజల ఇళ్ల వద్దకు పంపించారు. నాపై ఆరోపణలకు ఎందుకు ఆధారాలు చూపలేకపోతున్నారు. చేతనైతే వాటిపై చర్యలు తీసుకోండి" అని సవాల్ విసిరారు. "తిరుపతి లడ్డూలో పందికొవ్వు కలిపారని సీఎం, డిప్యూటీ సీఎం ప్రచారం చేశారు. ఈ రోజు లడ్డూలో అలాంటిదేమీ లేదని తేలింది. తాము ఒకటి చేయాలనుకుంటే మరొకటి జరిగిందని కూటమి నేతలు బాధపడుతున్నారు. ఇలాంటి దుష్ప్రచారాలు చేసేవాడు హిందూమతాన్ని కాపాడతాడా? నకిలీ మద్యం విషయంలో తప్పుడు ఆధారాలతో బురదజల్లారు. దీనిపై లీగల్‌గా ఫైట్ చేస్తాం. మమ్మల్ని ఇబ్బంది పెట్టినవారిని ఎవరినీ వదలం" అని హెచ్చరించారు.

# పడిపోతున్న డాలర్.. నిలకడగా రూపాయి

ప్రపంచ కరెన్సీ మార్కెట్లలో తీవ్ర ఒడుదొడు కులు కొనసాగుతున్నాయి. ప్రధాన కరెన్సీల తో పోలిస్తే అమెరికా డాలర్ బలహీనపడు తుండగా, భారత రూపాయి మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. డాలర్ బలహీనత కారణంగా భారత్‌లోకి విదేశీ సంస్థాగత పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని ఎమ్‌కే వెల్త్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ మంగళవారం విడుదల చేసిన నివేదికలో అంచనా వేసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు, అంతర్జాతీయ పరిణామాల కారణంగా డాలర్ విలువ పడిపోతోందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ సుమారు రూ.90 వద్ద నిలకడగా ఉందని, స్వల్పకాలంలో ఇదే స్థాయిలో కన్సాలిడేట్ కావొచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నట్లు తెలిపింది. భారత్ నికర దిగుమతిదారుగా ఉండటం రూపాయిపై భారం మోపుతున్నప్పటికీ, విదేశీ పెట్టుబడులకు అవకాశాలు మెరుగుపడటం మద్దతుగా నిలుస్తుందని వివరించింది. గత 18 నెలలుగా భారత ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థలు నికర అమ్మకందారులుగా ఉన్నాయి. దీంతో పలు రంగాల్లో షేర్ల విలువ ఆకర్షణీయంగా మారింది. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గితే, డాలర్‌పై రాబడి తగ్గి, భారత్ వంటి వర్ధమాన మార్కెట్ల వైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. "బలహీనపడిన డాలర్, వర్ధమాన మార్కెట్ల వైపు పెట్టుబడుల మళ్లింపు వంటివి అవకాశాలను, అదే సమయంలో నష్టభయాలను కూడా సృష్టిస్తున్నాయి. భారత్‌లో స్థిరమైన ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో విదేశీ పెట్టుబడులు కొనసాగితే, ప్రపంచ ఒడుదొడుకులు ఉన్నప్పటికీ రూపాయి ప్రస్తుత స్థాయిలోనే కొనసాగవచ్చు" అని ఎమ్‌కే వెల్త్ మేనేజ్‌మెంట్ సేల్స్ హెడ్ పరాగ్ మోరే వివరించారు. 2025 ప్రారంభం నుంచి డాలర్ ఇండెక్స్ దాదాపు 9 శాతం పడిపోయి 98.60 వద్ద ఉంది. అయితే, సముద్ర రవాణా మార్గాలకు అంతరాయాలు లేదా ముడిచమురు సరఫరాలో సమస్యలు తలెత్తితే స్వల్పకాలంలో డాలర్‌కు మళ్లీ డిమాండ్ పెరిగే ప్రమాదం ఉందని, కాబట్టి హెడ్జింగ్ వ్యూహాలు పాటించడం మంచిదని నివేదిక సూచించింది.

## దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె...
# స్తంభించిన సేవలు

వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో దేశవ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగులు మంగళవారం సమ్మెకు దిగారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు జరిగిన ఈ సమ్మెతో బ్యాంకింగ్ సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. నగదు డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్, చెక్కు క్లియరెన్సులు వంటి రోజువారీ లావాదేవీలు నిలిచిపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేశంలోని దాదాపు అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. గుజరాత్‌లోని వడోదర, పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బెహార్, ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ సహా అనేక నగరాల్లో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఐదు రోజుల పని విధానం కోసం ప్రభుత్వానికి చాలాసార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి స్పందన లేకపోవడంతో సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. "ఈరోజు సమ్మెలో దేశవ్యాప్తంగా 8 లక్షల మందికి పైగా ఉద్యోగులు పాల్గొంటున్నారు. 2015 నుంచి మా డిమాండ్ పెండింగ్‌లోనే ఉంది. ఎల్ఐసీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే వారానికి 5 రోజుల పనివిధానం అమలవుతోంది. బ్యాంకుల్లోనూ అమలు చేస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు" అని ఓ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)తో జరిగిన ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఆరు నెలల్లోనే 5 రోజుల పనిదినాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ రెండేళ్లు గడిచినా ఆ హామీ నెరవేరలేదని పాట్నాలో ఉద్యోగులు తెలిపారు. "ఆర్‌బీఐ, నాబార్డ్, సెబీ వంటి సంస్థలన్నీ 5 రోజులే పనిచేస్తున్నాయి. మాకు మాత్రం ఎందుకు అమలు చేయడం లేదు?" అని వారు ప్రశ్నించారు. యూపీలోని ఘాజీపూర్ జిల్లాలో దాదాపు 250 బ్యాంకులకు చెందిన 10,000 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో సుమారు రూ.150 కోట్ల విలువైన లావాదేవీలు నిలిచిపోయాయి. ప్రభుత్వ హామీ నెరవేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి.

## ఏపీకి రానున్న రాహుల్ గాంధీ...
## షర్మిల ఆహ్వానానికి గ్రీన్ సిగ్నల్

ఏపీ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న ఉద్యమంలో పాల్గొనాలని ఆమె చేసిన ఆహ్వానానికి రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారు. ఏపీ పర్యటనకు వస్తానని, పార్టీ పోరాటంలో భాగస్వామ్యం అవుతానని ఆయన హామీ ఇచ్చినట్టు షర్మిల తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని 10 జనపథ్‌లో ఉన్న రాహుల్ గాంధీ నివాసంలో ఈ సమావేశం జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ ఉద్యమంలో పాల్గొనాల్సిందిగా షర్మిల రాహుల్‌ను కోరారు. ఇందుకు రాహుల్ అంగీకరించారని, త్వరలోనే ఏపీకి వస్తానని మాట ఇచ్చారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 2వ తేదీతో ఉపాధి హామీ పథకం ప్రారంభమై 20 ఏళ్లు పూర్తికానుంది. ఈ నేపథ్యంలో, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామం నుంచే ఈ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు షర్మిల వివరించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని ఆమె వెల్లడించారు.

# ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా హనుమ.



**అవార్డు స్వీకరణ పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు**

**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 27;**డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం నవాబుపేట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వి.హనుమ జిల్లా ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు.భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అందించే సేవల విభాగంలో హనుమను ఎంపిక చేసింది. ఈమేరకు కార్యదర్శి హనుమ అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అవార్డు స్వీకరించడం పట్ల ఎంపీడీఓ ఏ రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య హర్షం వ్యక్తం చేసింది

# పెన్ పవర్

## కాకినాడ

## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ఎస్సీ ఎస్టీ విద్యుత్ వినియోగదారు లకు రూఫ్ టాప్ సోలార్ కనెక్షన్లు



**-జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్**

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 27:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న ఎస్సీ ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు రానున్న ఏప్రిల్ నాటికి రూఫ్ టాప్ సోలార్ కనెక్షన్లు ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఏపీ ఈపీడీసీఎల్ ఇంజనీర్లు ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా విద్యుత్ ఎస్సీ ఎస్టీలకు చాలా రూఫ్ టాప్ లు ఏర్పాటు, రిపెండెడ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం అమలు సర్క్యూట్ కండక్ట ర్ ఏర్పాటు అంశాల పురో గతిపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో సుమారు 24 వేల మంది 200 యూనిట్ల లోపు యూనిట్ల విద్యుత్తును వినియోగిస్తున్న ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులు ఉన్నారని వీరిలో రామచంద్రపురం డివిజన్లో సద్భావన ఇన్ఫ్రాటెక్ వారి ద్వారా 6వేల యూనిట్లకు గాను ఇప్పటి వరకు 2900 సర్వే పూర్తి చేశారని తెలిపారు. అదేవిధంగా అమలాపురం డివిజన్లో రెండు గ్రూపులుగా 17,500 సోలార్ గ్రూప్ టాప్ లు ఏర్పాటుకు సర్వే జరుగు తుందని ఒక్కొక్క గ్రూపులో 9000 మరియు 8500 సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు . 200 లోపు విద్యుత్ వినియోగం కలిగిన ఎస్సీ ఎస్టీ వినియో గదారుల గృహాలపై సోలార్ రూప పలకలను ఏర్పాటు చేసినందుకుగాను నెలకు ఒక్కొక్క ఇంటికి 200 రూ పాయలు అద్దెను కూడా ప్రభుత్వం చెల్లించనున్నద న్నారు. రివేఫండ్ డిస్ట్రి బ్యూషన్ సెక్టార్ పథకం కింద అధిక విద్యుత్తులోడు ఉన్న గ్రామాలలో రెండు విభాగాలుగా విభజించి ఒక లైను గృహ అవసరాల విద్యుత్ వినియోగానికి, మరో లైన్ వ్యవసాయ అవసరాలకు అదేవిధంగా 24 గంటలు లోవోల్టేజ్ లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఈ పనులు మార్చిలో పూర్తి చేయాలని ఏపీ ఈపీడీసీఎల్ ఇంజనీర్లను ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కోనసీమ జిల్లాలో కొబ్బరిచెట్లు ఎక్కువ విస్తీర్ణంలో ఉండి నిత్యం కొమ్మలు కొబ్బరి ఆకులుపడి విద్యుత్ అంతరాయం సంభవిస్తున్న నేపథ్యంలో 88 కిలో మీటర్లు సర్క్యూట్ కండక్టర్ అండర్ గ్రౌండ్ విద్యుత్ వైర్లు వేయాలని నిధులు శాంక్షన్ అయ్యాయని ఆమె మేరకు వైర్ల అమరిక పనులు మార్చి లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈపీడీ సీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ బి రాజేశ్వరి ఈఈ లు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రజకలను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలి.



**కిర్లంపూడి, పెన్ పవర్, జనవరి 27:** రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని రజక చైతన్య సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు అన్నారు.కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామం రజక సంఘం ఆధ్వర్యంలో రజక వృత్తి చెరువు వద్ద ఉన్న దోభీఘాట్ వద్ద రజకులు కులవృత్తి ప్రకారం వంశపారంపరంగా వస్తున్న బల్లల పండుగను ఎంతో కోలాహలంగా విందు బోజనాలతో పండుగ జరుపుకున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రజక చైతన్య సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షులు టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు హాజరయ్యారు.ఈ సందర్భంగా రామారావు రజకుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం రజకుల వృత్తిపరంగా జీవించేందుకు కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేసి వారిని అన్ని రకాలుగా ఆదుకోవాలని ధోబి ఘాటుకు ఫ్రీ కరెంటు ప్రభుత్వం వారు వెంటనే కల్పించాలని రజకులకు ఆధునిక వృత్తి పనిముట్లను అందించి ఇల్లు లేని రజకులకు ఇల్లు నిర్మించాలని రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే విషయంపై అసెంబ్లీ లో తీర్మానం చేసి కేంద్రానికి పంపించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరినారు.ఈ కార్యక్రమంలో గ్రామం పెద్దలు , మాజీ ఎంపీటీసీ పాటంశెట్టి రవి, టిడిపి నాయకులు కుంచే తాతాజీ, బాలుకలు చిన్న, ఫిషర్మెన్ సొసైటీ ప్రెసిడెంట్ మురా సత్తిబాబు , గ్రామ రజక సంఘం అధ్యక్షులు గురజాపు సత్తిబాబు, సంఘం కార్యవర్గం నాయకులు దేవాధి శివాజీ, దాకమూరి సత్యనారాయణ, టేకు లోవరాజు, కడజాల వీరబాబు, దాక మూరి సత్యనారాయణ, కొవ్వూరి లోవయ్య, కొవ్వూరి లోవ కృష్ణ, కడజాల పుల్లయ్య, కనపర్తి లక్ష్మీనారాయణ. సంఘం మహిళా నాయకురాలు దేవాది

ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామంలో గల రజక సోదరులు, సోదరీమణులు పాల్గొని ఆనందంగా పూజలు నిర్వహించుకుని గంగమ్మ తల్లికి ప్రార్థనలు చేస్తారు.

## ఆలమూరు రైటర్ సుబ్రహ్మణ్యంకు ఉత్తమ సేవా పురస్కారం



**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 27;** గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ సేవ పురస్కార అవార్డును ఆలమూరు పోలీసు స్టేషను రైటర్ రాయుడు సుబ్రహ్మణ్యం అందుకున్నారు. అమలాపురం జిఎంసి బాలయోగి స్టేడియంలో ఏర్పాటుచేసిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈయన ఆలమూరు రైటర్ గా ఎంతో ఎంతో బాధ్యతగా సేవలందిస్తూ అందరి మన్ననలను అందుకుంటున్నారు అహర్నిశలు కృషి చేస్తున్న ఆయన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశారు. పురస్కారం అందుకున్న సుబ్రహ్మణ్యంను రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, స్థానిక ఎసై నరేష్ తదితరులు అభినందించారు.




# ఆలమూరు సిహెచ్‌సికి మూడు జిల్లా ఉత్తమ సేవ అవార్డులు

**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 27;**గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆలమూరు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి మూడు సేవ అవార్డులు ప్రకటించింది. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతుల మీదుగా సోమవారం ఈ అవార్డులను అందుకున్నారు. మంగళవారం విలేకరులతో సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శివశంకర్ మాట్లాడుతూ జిల్లాలో బెస్ట్ సిహెచ్‌సిగా ఆలమూరు సిహెచ్‌సిగా ఎంపికైందన్నారు. జిల్లా ఉత్తమ నర్స్ విభాగానికి హెడ్ నర్స్ జగదాంబకి దక్కిందన్నారు. జిల్లా ఉత్తమ శానిటేషన్ అవార్డు కె.రత్నకుమారికి దక్కిందన్నారు. ఈ అవార్డులను బాధ్యత మాపై మరింత పెరిగిందన్నారు.

# గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు



**ఎంపీడీవో రాజు**

**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 27;**గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో ఏ.రాజు అన్నారు. మండలంలోని గుమ్మిలేరులో మంగళవారం ఆయన పచ్చదనం, పరిశుభ్రత కోసం చెత్త సంపద కేంద్రం, గ్రామ చెరువులు, రోడ్ల పరిసరాలు, డ్రైనేజ్ వ్యవస్థలోని సిల్ట్ తొలగింపులను మంగళవారం క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే స్థానిక సిబ్బంది నుంచి పారిశుధ్య నిర్వహణపై వివరాలు సేకరించి గ్రామంలో క్షేత్రస్థాయిలో పారునీరు డ్రైనేజీలలో సిల్ట్ తొలగింపు విధానాన్ని ప్రత్యేకంగా తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. మరి ముఖ్యంగా చెత్త సంపద కేంద్రాల ద్వారా పంచాయతీకి ఆదాయం వనరుగా మార్చుకోవాలని ఆయన సూచించారు. అలాగే జీవవైవిధ్యానికి ఆలంబనగా నిలిచే వివిధ రకాలకు చెందిన మొక్కలను గ్రామ పరిధిలో నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అదేవిధంగా పారిశుధ్య నిర్వహణలో భాగంగా డ్రైనేజీలను అనునిత్యం శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే డస్ట్ బిన్లలో తడి, పొడి చెత్త వేరువేరుగా గ్రామస్థులు తప్పకుండా సేకరించి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. ఆ విధంగా చేయడం వలన పారిశుధ్య సిబ్బందికి ఎస్ డబ్ల్యూ సి షెడ్ల నిర్వహణకు సహకారం అందించిన వారవుతారని ఆయన అన్నారు. ఇందుకోసం ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమించినట్లు కార్యదర్శి, ఆయనకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఈదల వీర్రాజు, కార్యదర్శి కె.రాకేష్ కుమార్, సచివాలయ, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసీఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

' ఐదు రోజులకు '

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

# కూటమి ప్రభుత్వంతోనే కార్మికుల అభివృద్ధి,సంక్షేమం



**మంత్రి వాసంశెట్టి సుభాష్**

**రామచంద్రపురం/విజయవాడ, పెన్ పవర్, జనవరి 27:**కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బీఆర్టీఎస్ రోడ్డు శారద కాలేజ్ సమీపంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఆటోల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమాలను మంత్రి అభినందించారు.యువగళం పాదయాత్ర మూడవ వార్షికోత్స వాన్ని పురస్కరించుకుని సుమారు 70 ఆటోలను కార్మికులకు అందించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా 300 నుంచి 400 కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు.వేదికపై ఉన్న ఎంపీ కేశినేని శివ, రఘురామరాజు,నూర్ బాషా సంఘం చైర్మన్ నాగూర్ మీరా తదితరులకు మంత్రి నమస్క రించారు. గత పాలకులపై విమర్శలు చేస్తూ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. అలాగే మంత్రి నారా లోకేష్ 3132 కిలోమీటర్లు, 226 రోజుల పాటు సాగించిన పాదయాత్ర రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చిందని, గూగుల్ క్లౌడ్ వంటి పెట్టుబడులు రావడంలో ఆయన కృషి ప్రధానమని పేర్కొన్నారు.కార్మిక చైతన్య యాత్ర ద్వారా 120 నియోజకవర్గాల్లో పర్యటించి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారని,టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికుల అంశాలను చేర్చడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారుచంద్రబాబు నాయుడు నివాసంపై దాడి జరిగిన సమయంలో ప్రాణాలకు తెగించి అడ్డుకున్నారంటూ రఘురామ రాజును ప్రశంసించారు. కార్మికు లకు ఇన్సూరెన్స్, తక్కువ వడ్డీ రుణాల కల్పన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని చిన్ని, నూర్ భాషా సంఘం చైర్మన్ నాగూర్ మీరా,ఆటో కార్మికులు,హోటల్ నాయకులు,కార్యకర్తలు,టీఎన్టీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట డొక్కా సీతమ్మ క్యాంటీన్ లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 27:** జగంపేట టౌన్ పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ కాంటీన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ జనసేన నాయకులతో కలిసి హాజరై పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని ఆదర్శం గా తీసుకుని డొక్కా సీతమ్మ క్యాంటీన్ పేరుతో నిరుపేద ప్రజలకు భోజనాన్ని అందించే కార్యక్రమం నిర్వహిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరావు, అంకం ఓం కృష్ణ, అడబాల వీరబాబు, తుమ్మల మనోజ్, స్వామి, సత్తి సోమరాజు, గాది నాగరాజు, రామకుర్తి శ్రీమన్నారాయణ, డ్రిల్ మాస్టారు, జగ్గంపేట నియోజకవర్గం జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైనారిటీలపై దాడులు హేయమైన చర్య



**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 27:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనారిటీలపై చేస్తున్న దాడులు హేయమైన చర్యని ఆ దాడులు దేశవ్యాప్తంగా సంచాలను సృష్టిస్తున్నాయని వైసిపి రాష్ట్ర నాయకులు ఆరోపిస్తున్నారు. మంగళవారం జగ్గంపేటలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో మతతత్వంపై పలు విషయాలు బయటపడుతున్నాయన్నదనికి నిదర్శనాలు ఉన్నాయన్నారు. రెడ్ బుక్ పేరిట జరుగుతున్న అరాచకాలకు సరైన మార్పు తీసుకురావడానికి తాము సిద్ధపడుతున్నామన్నారు. కాకినాడ జిల్లాలోని గొల్లప్రోలు కొత్తపేటలో 25 సంవత్సరాలుగా ప్రార్థన చేసుకుంటున్న పురాతన రెండు చర్చిలలో కూటమి ప్రభుత్వంకు సంబంధించి పలువురు ఘర్షణకు దిగిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అలాగే సత్యసాయి జిల్లాలోని, అనంతపురం జిల్లాలోని, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో, భీమిలిలో క్రైస్తవ మత సంఘాలపై ఏసుప్రభువును నమ్ముకునే వారిపై జరుగుతున్న సంఘటనలు వర్ణనాతీతమన్నారు. మత స్వేచ్ఛ అనేది రాజ్యాంగంలోనే ఉందని ఎప్పుడు లేని విధంగా దేశంలోని రాష్ట్రంలోని వివక్ష ఎందుకు జరుగుతుందని పలువురు క్రైస్తవులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఏపీ రాష్ట్ర వైఎస్ఆర్సిపికి ప్రెసిడెంట్ మాజీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే జాన్ వెస్లీ, కాకినాడ జిల్లా వైఎస్ఆర్సిపి క్రిస్టియానిటీ సెల్ అధ్యక్షుడు జడాల జాషువా గిరి, వైయస్ఆర్సీపీ క్రిస్టియానిటీ రాష్ట్ర కార్యదర్శి మార్తా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు మండల కమిటీ సమావేశం



**గండేపల్లి, పెన్ పవర్, జనవరి, 27:** గండేపల్లి మండలం గండేపల్లి సీఐటీయూ కార్యాలయం వద్ద వై.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సీఐటీయూ మండల కమిటీ సమావేశం జరిగినది.ఈ సమావేశ మునకు సీఐటీయూ జిల్లా ఉపధ్యక్షురాలు ఈ చంద్రావతి హాజరయ్యారు..కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్ లు రద్దు చేయాలని.కార్మికులకు కనీస వేతనాలు26000 చెల్లించాలని . భవన నిర్మాణ కార్మికులు కి సంక్షేమ బోర్డ్ అమలు చేయాలని స్కీం వర్కర్స్ ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి అని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ ఆపాలని. పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని .ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మె లో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలువు ఇచ్చారు.అనంతరం మండల తహశీల్దార్ శ్రీనివాస్ గారికి సమ్మె నోటీస్ లు అందించారు .ఇచ్చినవారిలో సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శి లు వై.శ్రీనివాస్ రెడ్డి నొక్కు లలిత.. మహేష్.ప్రసాద్.లక్ష్మీ.సుజాత ..అంగన్వాడీ. ఆశా బిల్డింగ్ రంగాల నుండి కార్మికులు ఉన్నారు......

### ఆదిత్య యూనివర్సిటీలో ఐ.టి. విభాగంలో ఐఓటీ వర్క్‌షాప్



**గండేపల్లి, పెన్ పవర్, జనవరి ,27:** ఆదిత్య యూనివర్సిటీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒ డేటా సైన్స్ విభాగం, సిఎస్?ఐ స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో ఏపీఎస్?ఎస్?డీసీ సహకారంతో మూడవ సంవత్సరం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒ డేటా సైన్స్ విద్యార్థుల కోసం " క్వాంటం కంప్యూటింగ్ " పై ఐదు రోజుల వర్క్ షాప్ ప్రారంభించడం జరిగింది. ఈ కోర్సుకు నేషనల్ మేనేజ్డ్ సర్వీసెస్, హైదరాబాద్ కు చెందిన సీనియర్ అనలిస్ట్ శ్రీ డేనియల్ ఫ్రాన్స్ వా గారు రిసోర్స్ పర్సన్ గా వ్యవహరిస్తారు. విద్యార్థులకు క్వాంటం కంప్యూటింగ్ యొక్క మౌలిక సూత్రాలు, క్వాంటం బిట్స్ , క్వాంటం అల్గోరిథమ్స్, క్వాంటం సర్క్యూట్స్, ప్రాక్టికల్ అప్లికేషన్స్ మరియు భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యం. ప్రారంభ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్. రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజినీరింగ్ ఒ సైన్స్) డాక్టర్ ఎ. రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.వి. రాజేష్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ మాకినీడి రాజాబాబు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వి. సతీష్ కుమార్ మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# "కాట్రేనికోన"కు ఉత్తమ సేవా పురస్కారాలు





**కాట్రేనికోన పెన్ పవర్ జనవరి 27:** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్
చేతుల మీదుగా కాట్రేనికోన డిప్యూటీ ఎంపిడిఓ నున్న శంకర్ నారాయణ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు.
గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా గోదావరి భవన్ నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు.విధి నిర్వహణలో బాధ్యతాయుతమైన సేవలను ప్రజలకు అందిస్తూ అటు ప్రజలకు ఇటు ప్రభుత్వానికి వారధిలా నిరంతరం సేవలందిస్తున్నటువంటి డిప్యూటీ ఎంపిడిఓ నున్న శంకర్ నారాయణకు అవార్డు అందుకున్నారు,కాట్రేనికోన ప్రాదమిక ఆరోగ్య కేంద్రం ఫార్మసీ ఆఫీసర్ ఎస్ కృష్ణ బ్రహ్మం (గోపి),హెల్త్ అసిస్టెంట్ లు కొప్పిశెట్టి నాగేంద్ర రావు,ఆర్ శ్రీపతి, పల్లంకుర్రు విద్యుత్ లైన్ మెన్ బద్రి గంగాధర రావు లకు ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. అంకిత భావంతో పనిచేస్తే ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు,ఉద్యోగులుకు ఉత్తమ సేవా అవార్డులు రావడం పట్ల కాట్రేనికోన
ఎంపిడిఓ బి రాజేశ్వర రావు, తహసిల్దార్ రవి కిరణ్, ఎంపీపీ కోలాటి సత్యవతి సత్యం, మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వర రావు, వైద్యాధికారులు ఎమ్ లిఖిత పి నీలిమా,ఏఈ ఎమ్ శ్రీనివాస్,
ఏపీఓ బి చంద్ర మోహన్, సర్పంచ్ లు గంటి వెంకట సుధాకర్,నాతి అలివేలు,చెల్లి సురేష్ తెలుగు యువత అధ్యక్షుడు వంగా దుర్గా బాబు,ఎస్ సి సెల్ అధ్యక్షుడు బదుగు పుల్లారావు,ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు,నాయకులు, సహచర తోటి ఉద్యోగస్తులు హర్షం వ్యక్తం చేశారు.





## వారానికి రెండు రోజుల సెలవు అమలు చేయాలి




**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 27 :** వారానికి రెండు రోజుల సెలవులు అమలు చేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ తుని రీజినల్ సెక్రటరీ ఎల్. విజయబాబు, ఆఫీసర్స్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ ఎన్.రాజేష్ డిమాండ్ చేశారు. జగ్గంపేటలో మంగళవారం కొత్త కొండబాబు కాంప్లెక్స్ వద్ద బ్యాంక్ ఉద్యోగులు నిరసన చేశారు. యునైటెడ్ ఫారం ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపుమేరకు బ్యాంక్లు బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న పని ఒత్తిడికి అనుగుణంగా వారానికి రెండు రోజులు సెలవులు ప్రకటించాలన్నారు. అన్ని కేంద్ర ప్రభుత్వ రంగాల్లోని ఉద్యోగులకు 5 రోజుల పనిదినాన్ని కల్పించడం జరిగిందని అవి బ్యాంకింగ్ రంగంలో మాత్రం అమలు కావడం లేదన్నారు. గతంలో మేము చేసిన ఆందోళనలో వారానికి రెండు రోజుల సెలవు హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలని అడుగుతున్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఐఓబి తదితర బ్యాంక్ ఉద్యోగుల సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం.

**-మండల బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు.**



**కిర్లంపూడి,పెన్ పవర్,జనవరి 27:** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద నిరుపేద కుటుంబాలకు చెందిన స్త్రీలకు ఉచిత గ్యాస్ కనెక్షన్ తో పాటు, గ్యాస్,స్టవ్, రెగ్యులేటర్ ఫ్రీగా అందివ్వడం జరుగుతుందని మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు తెలిపారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమరాయణంపేట గ్రామంలో
ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని కిర్లంపూడి మండలం సోమరాయణంపేట గ్రామంలో కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ఆదేశాలతో అర్హులైన కుటుంబాలను గుర్తించి ఆన్లైన్ చేయడం జరుగుతుందన్నారు. మంజూరైన వెంటనే లబ్ధిదారులకు పథకాన్ని అందజేయడం జరుగుతుందని రాజబాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఎంపిటిసి ల సమాఖ్య అధ్యక్షులు, బిజెపి సీనియర్ నాయకులు అల్లు శివరామకృష్ణ ,బుద్ధ పెద్దకాపు, మారిశెట్టి త్రిమూర్తులు, బొడ్డేటి చిన్నబ్బాయి, ఆడారి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## రిపబ్లిక్ డే పేరెడ్‌లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థికి అభినందనలు



**కాకినాడ, పెన్ పవర్,జనవరి 27 :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ వింగ్ వాలంటీర్, బి.ఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రథమ సంవత్సరం విద్యార్థి కె. ధనుంజయ, అమరావతిలో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల రిపబ్లిక్ డే పేరెడ్‌లో పాల్గొనడం గర్వకారణమని కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు తెలిపారు.రాష్ట్ర రాజధాని అమరావతి పేరిడ్ గ్రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా యూత్ రెడ్ క్రాస్ వింగ్ టీమ్‌లో భాగంగా ధనుంజయ కంటింజెంట్‌గా ఎంపికై, వారం రోజుల శిక్షణ అనంతరం పేరెడ్‌లో పాల్గొన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన రిపబ్లిక్ డే క్యాంప్‌లో భాగస్వామి కావడం ఎంతో ఆనందంగా ఉందని విద్యార్థి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ, ఆర్డీ క్యాంప్‌కు ఎంపిక కావడం అత్యంత అభినందనీయమని, యూత్ రెడ్ క్రాస్ వింగ్ కార్యక్రమాలలో ఇది ఒక ప్రతిష్టాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం, యూత్ రెడ్ క్రాస్ వింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యతో పాటు సాంస్కృతిక అంశాలు, క్రీడలు, మార్చింగ్ వంటి అంశాలలో శిక్షణ అందించటం వల్ల ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు.రెడ్ క్రాస్ వాలంటీర్లకు రిపబ్లిక్ డే పేరెడ్‌లో పాల్గొనే అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ శ్రీ వై.డి. రామారావు, కాకినాడ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.రిపబ్లిక్ డే పేరెడ్ క్యాంప్‌లో పాల్గొన్న ధనుంజయను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు,వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ,యూత్ రెడ్ క్రాస్ వింగ్ నోడల్ ఆఫీసర్ టి.తేజేశ్వరరావు,డి. అశ్విని తదితర అధ్యాపకులు హృదయపూర్వకంగా అభినందించారు.

## ఆదిత్య యూనివర్సిటీలో సి.ఎస్.ఇ విభాగంలో ఐదు రోజుల ఐఓటీ వర్క్‌షాప్ ప్రారంభం



**గండేపల్లి, పెన్ పవర్, జనవరి, 27:** గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో హాండ్స్ ఆన్ ఐ.ఓ.టి బిల్డింగ్ స్మార్ట్ సొల్యూషన్స్ విత్ కనెక్టెడ్ డివైజస్
అనే అంశంపై ఐదు రోజుల వర్క్?షాప్ ప్రారంభమైనట్లు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.
ఈ వర్క్?షాప్?కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్డీసీ) నుండి డి. శశి కిరణ్ రిసోర్స్ పర్సన్?గా హాజరై, ఐఓటీ మౌలికాంశాలు, స్మార్ట్ డివైస్లు , కనెక్ట్ సిస్టమ్స్, రియల్-టైమ్ అప్లికేషన్ మరియు హ్యాండ్స్-ఆన్ ప్రాక్టికల్ శిక్షణ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ వర్క్?షాప్ ఐదు రోజులపాటు నిర్వహించబడుతుండగా, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన సుమారు 70 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు.ఈ వర్క్?షాప్ ద్వారా విద్యార్థులు ఐఓటీ సాంకేతికతలో ప్రాయోగిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం తో పాటు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా స్మార్ట్ సొల్యూషన్ రూపకల్పనపై అవగాహన పొందుతారని సి.ఎస్.ఇ విభాగాధిపతి డా. టి. సుధారాణి తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో-చాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్-చాన్సలర్ డా. ఎం. బి. శ్రీనివాస్, ప్రో వైస్-చాన్సలర్ (అకాడమిక్స్) డా. ఎస్. రమాశ్రీ, ప్రో వైస్-చాన్సలర్ (ఇంజనీరింగ్ అండ్ సైన్సెస్) డా. ఎ. రమేష్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అసోసియేట్ డీన్ డా. ఎం.వి. రాజేష్, కోఆర్డినేటర్ డా. కె. నాగరాజు మరియు సి.ఎస్.ఇ. విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

## వెంకన్న బ్రహ్మోత్సవాలకు రూ.54 వేల విరాళం



**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 27;** మండలంలోని చింతలూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి తృతీయ పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలకు నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, పారిశ్రామికవేత్త, ఆలమూరుకు చెందిన వంటిపల్లి పాపారావు రూ.54 వేల విరాళం అందజేశారు. దీంతో దాత పాపారావుకు గో పరంధామం, గోశాల అన్నదానం ట్రస్టు ఫౌండర్ అండ్ మేనేజింగ్ ట్రస్టీ అల్లంరాజు శివకుమార భరణి, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ పై తప్పుడు ప్రచారం నిర్వహిస్తే ఉపేక్షించేది లేదు.



**కిర్లంపూడి, పెన్ పవర్, జనవరి 27:**ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ పై తప్పుడు ప్రచారం నిర్వహించినా,అసభ్య పదజాలాలు వాడినా, అటువంటి వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని
ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ తీవ్రంగా హెచ్చరించారు.
ఇటీవల కొంతకాలంగా ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ పై తప్పుడు ఆరోపణలు చేస్తూ పలువురు వద్ద మాట్లాడుతున్న వ్యక్తులపై తీవ్రంగా విరుసుకు పడ్డారు.అటువంటి వారిని ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ సభ్యులు తీవ్రంగా హెచ్చరించింది. మంగళవారం కిర్లంపూడి లో ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు ఐక్యతతో పాల్గొని ముక్తకంఠంతో వారు మాట్లాడుతూ కొన్ని ఛానల్ ని అడ్డుపెట్టుకుని అభద్రతాభావంతో సంఘాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలో భాగంగా ప్రెస్ క్లబ్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వారు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు ఇక మీదట ఇటువంటివి చూస్తూ ఊరుకోమని, తగిన సమయంలో అలాంటి వారికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశం నిర్వహించి పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ పాలకవర్గ సభ్యులు పెంటకోట సాయి, ఉడతా అప్పారావు, నేదూరి లక్ష్మణరావు,తుమ్మల సుబ్బు, ముద్రగడ రమేష్, శరకణం నాగేంద్ర,బొండా కృష్ణ,మొల్లేటి సాంబాశివ, గండే నాని, బత్తిన సత్యన్నారాయణ, సోరపురెడ్డి పెద్ద, మురా చంటిబాబు, మద్రా చిట్టిబాబు, ఆడారి సురేంద్ర,టి.వి.వి. కృష్ణ, చెప్పుల రాంబాబు, యనమల జ్యోతిబాబు పడాల శివ, సూరిశెట్టి శివ, ఆడారి గంగబాబు,దాడిశెట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గోల్డ్ మెడల్ సాధించిన ఆశెట్టి ఆదిబాబు కు సత్కారం



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 27:**అమలాపురం కేంద్రంగా జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు అద్భుత ప్రదర్శన చేశారు. బెంచ్ ప్రెస్ విభాగంలో 105 కేజీల వెయిట్ లిఫ్ట్ చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు.
ఈ సందర్భంగా అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆదిబాబును ఘనంగా సన్మానించింది. 2వ వార్డు అభివృద్ధిలోనూ, ప్రజా సేవలోనూ ముందుండే ఆదిబాబు, క్రీడల్లోనూ రాణించడం పట్ల పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిక్కాల వినాయకరావు, బోణం సత్తిబాబు, కంచిపల్లి అబ్బులు, బిజెపి నాయకులు మోకా వెంకట సుబ్బారావు, చాంబర్ సెక్రెటరీ కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, ట్రెజరర్ దొమ్మేటి సాయిబాబు, గోల్డ్ మార్కెట్ అధ్యక్షులు ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి, యర్రంశెట్టి నారాయణమూర్తి, కొవ్వూరు వెంకటరెడ్డి, మేడిచర్ల త్రిమూర్తులు, శేట్అనిల్ కుమార్ జైన్, చింతలపూడి సత్తిబాబు ఆకుల నాగేశ్వరరావు, వలవలశివరావు, ఆశెట్టి శ్రీను ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఏపీ జేఏసీ అమరావతి ఆవిర్భావ మహాసభకు తరలి రావాలంటూ పిలుపు

**కాకినాడ, పెన్ పవర్,జనవరి 27:**ఏపీ జేఏసీ అమరావతి ఏర్పాటు అయి దశాబ్ద కాలం పూర్తి అయిన సందర్భంగా ఫిబ్రవరి 5న విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 9 గంటలకు ఆవిర్భావ మహాసభ జరగనున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి కాకినాడ జిల్లా శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అదే రోజు ఉదయం 9 గంటలకు స్థానిక లెనిన్ సెంటర్ నుంచి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ సభా ప్రాంగణం వరకు నిర్వహించనున్నట్లు వెల్ల డించారు.ఈ ర్యాలీ, మహాసభలకు ఏపీ జేఏసీ అమరావతి అనుబంధ సంఘాలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ మరియు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు వందలాదిగా కాకినాడ జిల్లా నుంచి పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా శాఖ చైర్మన్, జనరల్ సెక్రటరీలు కోరారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ సభ్యులైన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్,రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో పాటు పలువురు ఐఏఎస్ ఉన్నతాధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు.ఉద్యోగులకు ఇప్పటివరకు రావలసిన పెండింగ్ బకాయిలు,12వ పీఆర్‌సీ,ఐఆర్‌లు, ఆర్థికఆర్థికేతర ప్రయోజనాల సాధన కోసం ఉద్యోగులు వేలాదిగా తరలివచ్చి తమ ఐక్యతను,బలాన్ని ప్రదర్శించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కావున సదరు మహాసభకు హాజరై విజయ వంతం చేయాలని కాకినాడ జిల్లా నాయకులు పితాని త్రినాథ్, ఎన్వీ దుర్గా ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## జనార్ధనస్వామిని దర్శించుకున్న యానాం భక్తులు



**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 27;**కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు మంగళవారం ఆలమూరు శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి వారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు వారికి సాదర స్వాగతం పలికారు. 5 వేల ఏళ్ళ నాటి ఆలయం విశేషాలను అర్చకులు అంగర భగవానాచార్యులు వారికి వివరించారు.తీర్థ ప్రసాదాలు అందజేశారు. జనార్ధన క్షేత్రాల సందర్శనలో భాగంగా ఆలమూరు వచ్చామని స్వామి వారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని వారు తెలిపారు.

# నిర్లక్ష్యం లో విద్యుత్ శాఖ సిబ్బంది



కూలిపోయేలా ట్రాన్స్ పార్మర్ దిమ్మ

**అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 27:**విద్యుత్ ప్రమాదాలు జరిగిన తర్వాత హుటాహుటిన పనులను చేపడుతున్నారు తప్ప ప్రమాదాలు పొంచిఉన్న వాటిపై ఏమాత్రం చర్యలయ చేపట్టడంలేదని వినియోగదారులు మండిపాఎఉతున్నారు.
విద్యుత్ ట్రాన్స ఫార్మర్, విద్యుత్ స్థంబాలు ఒరిగి విరిగిపోయే స్థితిలో ఉన్న వాటిపై పర్యవేక్షణలో సంబంధిత. అధికారుల నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ పశు
వైద్యశాల ఎదురుగా ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మ్ సిమెంట్ దిమ్మ భూమిలో క్రుంగి ప్రక్కకు ఒరిగిపోయింది. సిమెంట్ దిమ్మ పై ఉన్న ట్రాన్స్ఫర్మ్ కూడా ఒరిగి పోవడంతో, ట్రాన్స్ఫార్మ్ ను ఒకవైపు పైకి లేపి కింద రాళ్లను పెట్టి సమాంతరంగా చేశారు. అయితే ఒరిగిపోయిన సిమెంట్ దిమ్మకు ఇనుప కడ్డీతో బోటు పెట్టారు. మురుగు కాలువ ప్రక్కనే సిమెంట్ దిమ్మను కట్టడంతో నేల మెత్తబడి దిమ్మ ఒరిగిపోయింది. ఎప్పుడైనా ప్రమాదం జరగవచ్చని, విద్యుత్ శాఖాధికారులు సరియైన చర్యలు తీసుకుని ట్రాన్స్ఫార్మ్ ఏర్పాటు చేసేందుకు నూతనంగా సిమెంట్ దిమ్మను నిర్మించాలని స్థానికుల కోరుతున్నారు.

## ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ పై తప్పుడు ప్రచారం నిర్వహిస్తే ఉపేక్షించేది లేదు.



**కిర్లంపూడి, పెన్ పవర్, జనవరి 27:**ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ పై తప్పుడు ప్రచారం నిర్వహించినా,అసభ్య పదజాలాలు వాడినా, అటువంటి వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని
ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ తీవ్రంగా హెచ్చరించారు.
ఇటీవల కొంతకాలంగా ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ పై తప్పుడు ఆరోపణలు చేస్తూ పలువురు వద్ద మాట్లాడుతున్న వ్యక్తులపై తీవ్రంగా విరుసుకు పడ్డారు.అటువంటి వారిని ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ సభ్యులు తీవ్రంగా హెచ్చరించింది. మంగళవారం కిర్లంపూడి లో ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు ఐక్యతతో పాల్గొని ముక్తకంఠంతో వారు మాట్లాడుతూ కొన్ని ఛానల్ ని అడ్డుపెట్టుకుని అభద్రతాభావంతో సంఘాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలో భాగంగా ప్రెస్ క్లబ్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వారు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు ఇక మీదట ఇటువంటివి చూస్తూ ఊరుకోమని, తగిన సమయంలో అలాంటి వారికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశం నిర్వహించి పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ పాలకవర్గ సభ్యులు పెంటకోట సాయి, ఉడతా అప్పారావు, నేదూరి లక్ష్మణరావు,తుమ్మల సుబ్బు, ముద్రగడ రమేష్, శరకణం నాగేంద్ర,బొండా కృష్ణ,మొల్లేటి సాంబాశివ, గండే నాని, బత్తిన సత్యన్నారాయణ, సోరపురెడ్డి పెద్ద, మురా చంటిబాబు, మద్రా చిట్టిబాబు, ఆడారి సురేంద్ర,టి.వి.వి. కృష్ణ, చెప్పుల రాంబాబు, యనమల జ్యోతిబాబు పడాల శివ, సూరిశెట్టి శివ, ఆడారి గంగబాబు,దాడిశెట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు సి ఐ, బిఎస్ అప్పారావుకు ఉత్తమ సేవా పురస్కారం

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, జనవరి 26:** ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్, బి సూర్య అప్పారావుకు విధి నిర్వహణలో అంకితభావంతో సేవలు అందించినందుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. దీంతో 77వ గణతంత్ర వేడుకులను పురస్కరించుకొని జిల్లా కేంద్రంమైన కాకినాడ ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పేరేడ్ గ్రౌండ్లో జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఇంచార్జ్ కలెక్టర్ అపూర్వ భారత చేతులమీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ సేవా పురస్కరణ అందుకున్న అప్పారావును సర్కిల్ పరిధిలో ఎస్సైలు, ఆయా స్టేషన్ల సిబ్బంది అభినందించారు.



## రూ.76 లక్షలతో గ్రామీణ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన



వాసంశెట్టి సత్యం

**రామచంద్రపురం/కె.గంగవరం, పెన్ పవర్,జనవరి 27:**గ్రామీణ రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం ఎర్రపోతవరం, బాలాంత్రం, తాళ్లపోడు గ్రామాల్లో రూ.76 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు డీఈ శ్రీనివాస్, ఏఈ యేసు రత్నం, కూటమి పార్టీ నాయకులతో కలిసి ఆయన కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధుల ద్వారా ఈ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు మీడియాకు తెలిపారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో ప్రధాన,అంత ర్గత రహదారుల నిర్మాణానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విశేషంగా కృషి చేసి నిధులు తీసుకొస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో కూడా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని,రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సాటిపాటి దొరబాబు, సర్పంచ్ పి. రాంబాబు, సెక్రటరీ నరాల సూరిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు రాయపరెడ్డి విశ్వేశ్వర సీతారామయ్య బాబు,ఎంపీపీ పంపన నాగమణి,కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాజులూరు ఉన్నత పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు




**కాజులూరు, పెన్ పవర్, జనవరి 27:** కాజులూరు ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యాన్యువల్ డే కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సాంస్కృతిక, జానపద కళలు మరియు వివిధ నైపుణ్యాలు వెలుగులోకి రావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహద పడతాయన్నారు. ప్రభుత్వం కూడా కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పిస్తూ, వార్షికోత్సవాల నిర్వహణకు ప్రోత్సహించడం శుభపరిణామమని తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పలు నృత్యాలు, లఘు నాటికలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.విద్యార్థులకు శిక్షణ అందించిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యా యులు ప్రత్యేకంగా అభినందించారు.

## ఎం.ఎస్.ఎన్ చారిటీస్ క్రీడా సంబరాలు

ప్రారంభం -ఎమ్మెల్యే వనమాడి



**కాకినాడ, పెన్ పవర్,జనవరి 27:**మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ 111వ వర్ధంతిని పురస్కరించుకుని ఎం.ఎస్.ఎన్ చారిటీస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులు, సిబ్బందికి వైభవంగా క్రీడా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరకమానసిక వికాసం సాధ్యమని తెలిపారు. విద్యార్థుల జీవితంలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన, ఆత్మవిశ్వాసం పెంపొందడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పుస్తక విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గెలుపుఓటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని క్రీడలు అలవర్చుతాయని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమని ప్రేరణాత్మకంగా చెప్పారు.కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. చైర్మన్ ఎలెవన్, ఈ.వో ఎలెవన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ప్రేక్షకులను ఉత్సాహపరిచింది. విద్యార్థులకు పరుగు పందెం, క్రికెట్, షాట్‌పుట్, కబడ్డీ, మ్యూజికల్ చైర్స్ వంటి పోటీలు నిర్వహించగా, సిబ్బందికి క్రికెట్, చెస్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.ఎన్ చారిటీస్ చైర్మన్ మల్లాడి కార్తిక నాయకర్, అసిస్టెంట్ కమిషనర్ మరియు కరస్పాండెంట్ చాగంటి సురేష్ నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు నులుకుర్తి సత్యసాయి,రాళ్ళపూడి ప్రకాష్,పి.లక్ష్మీప్రసన్న,పి.దుర్గప్రసాద్,పి. రాంజీ,ఎం.దుర్గప్రసాద్,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉషా,జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఎస్. సుబ్రహ్మణ్యం, సూపరింటెండెంట్ సోమరాజు,ఎన్.టి.వి అవధాని,హోత చంద్ర మౌళి తదితరులు పాల్గొన్నారు. క్రీడా కార్యక్రమాలను వ్యాయామ ఉపాధ్యాయులు వి.గోవింద, ఫిజికల్ డైరెక్టర్ మహాలక్ష్మీ సమర్థవంతంగా నిర్వహించగా,విద్యార్థులు మరియు సిబ్బంది క్రీడాస్ఫూర్తితో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ధర్మవరంలో కల్తీ వంట నూనె గుట్టురట్టు చేసిన ప్రత్తిపాడు పోలీసులు.

ఎస్సై లక్ష్మీకాంతంను అభినందించిన పెద్దాపురం డి.ఎస్.పి






**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జనవరి 27:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామ శివారున అక్రమంగా తయారీ చేస్తున్న కల్తీ వంట నూనె తయారీ కేంద్రంపై ప్రత్తిపాడు పోలీసులు దాడులు నిర్వహించారు.జిల్లా ఎస్పీ, జి బిందు మాధవ్ ఆదేశాలతో పెద్దాపురం డిఎస్పీ శ్రీహరిరాజు,సిఐ బిఎస్ అప్పారావు పర్యవేక్షణలో ఎస్సై లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో కల్తీ వంట నూనె తయారీకి పాల్పడుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుండి 75 కల్తీ నూనె డబ్బాలను,తయారీకి ఉపయోగిస్తున్న 4 క్రూడాయిల్ డబ్బాలు,తయారీకి ఉపయోగిస్తున్న పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న మీడియా సమావేశంలో డిఎస్పి,శ్రీహరిరాజు మాట్లాడుతూ అక్రమ ధనార్జనే ధ్యేయంగా పిఠాపురం మండలం ఎఫ్ కె పాలెం గ్రామానికి చెందిన బండారు ఫణి ప్రసాద్,ధర్మవరం గ్రామ శివారున జంతువుల కొవ్వు,క్రూడ్ ఆయిల్ కలిపి మరగబెట్టి కల్తీ వంట నూనె తయారు చేసి,ఇచ్ఛాపురంకి చెందిన వెంకటేశ్వర ట్రేడర్స్,యజమాని సంతోషి శ్రీనివాస్ దాస్,రాజమండ్రికి చెందిన యండి ఇర్ఫాన్ లతో ఒప్పందం కుదుర్చుకొన్నారు.గత నాలుగు నెలలుగా ఆప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు.నిందితుడితో పాటు మరో 8మంది ఈ అక్రమ దందాలో కొనసాగుతున్నారని వారిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.నిందితుడిని రిమాండ్ కు తరలిస్తామని అన్నారు.ప్రత్తిపాడు సిఐ బిఎస్ అప్పారావు సూచనలతో అక్రమ కల్తీ వ్యాపార దందాను చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై లక్ష్మీకాంతం, సిబ్బందిని డిఎస్పి శ్రీహరి రాజు అభినందించారు.ప్రజలు నకిలీ పదార్థాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.అక్రమ వ్యాపారాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎలక్ట్రికల్ ఏ ఈ కే మోహన్ రావు



**అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 27 :** 77 వ ఘన తంత్ర దినోత్సవం సందర్భంగా ఏ పి ఈ పి డి సి ఎల్ సి ఎం డి పృథ్వీ తేజ నుండి విశాఖపట్నం లో జరిగిన కార్యక్రమం లో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న జే ఈ కే మోహన్ రావు. ఈయన ప్రస్తుతం అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం లో ఎలక్ట్రికల్ జే ఈ గా విధులు నిర్వహిస్తున్నారు
కే మోహన్ రావు గతంలో కాట్రేనికోన మండలం లో సబ్ ఇంజనీర్ గా పని చేశారు. వృత్తి పట్ల అంకితభావం తో పనిచేసే మోహన్ రావుకు ఉత్తమ సేవా పురస్కారం రావడం పట్ల సహచర ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు

## కోనసీమ పుణ్యసీమగా వెదజల్లుతుందని ఋషికేశ్

హరి హరా నందస్వామీజీ



**అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 27:**కోనసీమలో ఏకాదశ రుద్రులు కొలువుతీరిన దేవాలయాలు ఉండటంతో పుణ్యసీమగా వెదజల్లుతుందని ఋషికేశ్ కు చెందిన హరి హరా నందస్వామీజీ అన్నారు. ఉత్తరాదికి చెందిన స్వామీజీల బృందం ఏకాదశ రుద్రులను మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హరిహరా నందస్వామీజీ మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో ఎక్కువగా శివాలయాలు ఉన్నాయని వాటిలో ఏకాదశ రుద్రులు కొలువైనున్నారన్నారు. ఈ రుద్రులు ప్రతిఏటా సంక్రాంతి మరునాడు కనుమ రోజున జగ్గన్నతోట ప్రభల తీర్థంలో ఒకేచోట కలవడం ప్రపంచంలోనే ఎంతో అరుదైన విషయన్నారు. అంతకుముందు ఏకాదశ రుద్రుల విశిష్టత, చరిత్ర, నిర్వహణ తదితర విషయాలను ఆలయ అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏకాదశ రుద్రుల ఆలయాలను సందర్శించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నడుతున్న శైవాగమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రదర్శించిన వేదవిద్యను ప్రశంసించారు.

# కాకినాడలో ప్రజా సమస్యల పరిష్కారానికి డివిజన్ పర్యటనలు దోహదం

ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ



**కాకినాడ పెన్ పవర్,జనవరి 27:**నగరంలోని ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణ పరిష్కారాలు చేపట్టేందుకు డివిజన్ స్థాయి పర్యటనలు ఎంతో ఉపయోగ పడుతున్నాయని కాకినాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. మంగళ వారం ఉదయం నగరంలోని 14, 15 డివిజన్ల పరిధిలోని ఏటిమొగ ప్రాంతంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించడంతో పాటు స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల డ్రైనేజీలు సరిగా పనిచేయడం లేదని, వీధి లైట్లు వెలగడం లేదని ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన ఇన్‌చార్జ్ కమిషనర్ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఆ ప్రాంతంలోని త్రాగునీటి నాణ్యతను స్వయంగా పరిశీలించి ప్రజలకు త్రాగునీటి భద్రతపై అవగాహన కల్పించారు.అనంతరం ఏటిమొగలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఫికల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్ పర్యటనల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.ఏటిమొగ ప్రాంతంలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, పారిశుధ్య నిర్వహణ పనులను కూడా సమీక్షించామని తెలిపారు.అసంపూర్తిగా ఉన్న ఫికల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, దాని పూర్తి కోసం అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.ఈ పర్యటనలో కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ చరణ్, ఈఈ ఆదినారాయణ, శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ధర్మాజీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య పోషణ పై శ్రద్ధ చూపాలి -ఏపీఎం సన్యాసిరావు





**గండేపల్లి, పెన్ పవర్, జనవరి, 27:**ఆరోగ్య పోషణ పై మహిళలు శ్రద్ధ వహించాలని స్థానిక వెలుగు ఏపిఎం సన్యాసిరావు అన్నారు. ఆరోగ్య పోషణ లింగ వివక్షతపై స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం గ్రామ సంఘ లీడర్లకు, వివో ఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సన్యాసిరావు మాట్లాడుతూ పరిశుభ్రత తోనే పూర్తి ఆరోగ్యం లభిస్తుందని గృహాల పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే మనం భుజించే ఆహారం పరిశుభ్రమైన చేతిలో ద్వారా భుజించాలన్నారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వాడకంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. చేతులు బాగా శుభ్రపరచుకుని తరువాత భుజించడం ద్వారా ఆరోగ్య ఉండటం జరుగుతుంది. ఆస్తులు కన్నా ఆరోగ్యమే మిన్న అన్న మాటలను ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. అలాగే ఆరోగ్యం పెంపొందించుకునేందుకు పెరటి తోటలు పెంచుకుని తినవలసిన అవసరం ఉందన్నారు. అలాగే పెరటి కోళ్లు పెంచుకుని వాటి గుడ్లు తినడం ద్వారా పరిపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుంది అన్నారు. చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు అన్నారు . తల్లి పిల్ల ఆరోగ్యము మరియు పోషణ తదితర అంశములపై అవగాహన పెంపొందించుకుని ప్రభుత్వం అందించే పోషణ విలువలతో కూడిన ఆహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవడం. అదేవిధంగా లింగ వివక్షత పై స్త్రీ పురుషుల మధ్య వివక్షత లేకుండా ఉండటం వాటిపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు కార్యాలయ సిబ్బంది, వి ఏ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# క్యాంటం కంప్యూటింగ్‌తో భవిష్యత్‌కు దారి




ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

**కాకినాడ పెన్ పవర్, జనవరి 27:**భవిష్యత్తులో క్యాంటం కంప్యూటింగ్ విప్లవాత్మక మార్పులకు దారితీస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. అత్యంత క్లిష్టమైన సమస్యలను ఊహకు అందనంత వేగంగా పరిష్కరించే సామర్థ్యం క్యాంటం కంప్యూటర్లకు ఉందని ఆయన అన్నారు.మంగళవారం కాకినాడలోని ఏఎస్‌డీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల (ఉమెన్స్)లో ఫిజిక్స్, కంప్యూ టర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంటం కంప్యూటింగ్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కాకినాడ నగరంలో ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడం వల్ల విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి ఉందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో పరిశ్రమల స్థాపనకు తక్కువ ధరకు భూమి కేటాయించి ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి జరుగుతుందని తెలిపారు.సాంప్రదాయ కంప్యూటింగ్‌కు భిన్నంగా ఆధునిక సిద్ధాంతాలు, లక్షణాలతో రూపొందిన సరికొత్త టెక్నాలజీనే క్యాంటం కంప్యూటింగ్ అని ఆయన వివరించారు. ఈ పరిజ్ఞానం భవిష్యత్తు టెక్నాలజీలో కీలక పాత్ర పోషించనుందని అన్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులకు రెండు రోజులపాటు క్యాంటం కంప్యూటింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. సువర్చల, ఫిజిక్స్ విభాగాధిపతి సూర్యనారాయణ దేవర, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎన్.సుబ్రహ్మణ్యే శ్వరి, కంపెనీ ప్రతినిధి జాన్ యల్లతో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పశు సంరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి

వాసంశెట్టి సత్యం

**రామచంద్రపురం/కె. గంగవరం, పెన్ పవర్,జనవరి 27:** రైతుల ఆర్థిక పరిపుష్టికి పశుసంపదే పునాదని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే పశు సంపద పరిరక్షణకు కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం తెలిపారు.కె.గంగవరం మండలం ఎర్రపోతవరం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరంలో ఆయన ఆ శాఖ ఏడి రామకృష్ణ, కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ ధ్యేయ మని స్పష్టం చేశారు. పశువుల ఆరోగ్యం కాపాడితేనే రైతు కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, పశు వ్యాధుల నివారణకు ఇలాంటి ఉచిత ఆరోగ్య శిబిరాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు సకాలంలో వైద్య సేవలు అందకపోవడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నా రని, ఆ సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం ఈ నెల 19 నుంచి 31 వరకు ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని తెలిపారు.ఈ శిబిరాల ద్వారా పశువులకు ఉచిత వైద్య పరీక్షలు,టీకాలు, మందుల పంపిణీ, పోషకాహారంపై అవగాహన కల్పించడం జరుగు తుందని వివరించారు.పశు ఆరోగ్య శిబిరాల వల్ల పశువుల మరణాలు తగ్గి,పాల ఉత్పత్తి పెరిగి, రైతుల ఆదాయం గణనీయంగా వృద్ధి చెందుతుందని నాయకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రతి గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తూ రైతులకు పూర్తి స్థాయిలో అండగా నిలుస్తామని, గ్రామీణాభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని సత్యం పేర్కొన్నారు.ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఏడి రామకృష్ణ మాట్లాడుతూ పశు సంరక్షణ కోసం ప్రభుత్వం ఈ ఉచిత శిబిరాలు నిర్వహిస్తోందని, పాడి సంపద కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, కూటమి పార్టీ నాయకులు, ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పి. రాంబాబు,సాటిపాటి దొరబాబు, సెక్రటరీ నరాల సూరిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు విశ్వేశ్వర సీతారామయ్య బాబు, పశు వైద్యులు, పిహెచ్‌సీ హాస్పిటల్ సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.



# కుండలేశ్వరం స్వామి వారికి కళ్యాణ మహోత్సవాలు



**కాట్రేనికోన పెన్ పవర్ జనవరి 27:**దక్షిణ కాశీగా పేరుపొందిన కుండలేశ్వరం గ్రామంలోని వేంచేసి యున్న శ్రీ పార్వతి కుండలేశ్వర స్వామి వారి శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణు గోపాల స్వామి వారు కళ్యాణ మహోత్సవములను ఈ నెల 28 వ తేదీ నుండి,వచ్చే నెల 2వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు,ఆరు రోజుల పాటు స్వామి వారికి ప్రత్యేక పూజలను ఏర్పాటు చేశామన్నారు,ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలన్నారు,
ఈ సందర్భంగా ఆలయానికి పచ్చని తోరణాలతో విద్యుత్ కాంతులతో అలంకరణ చేశారు భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు అధర్వంలో తగిన ఏర్పాట్లు చేశారు.

# స్తంభించిన బ్యాంకింగ్ సేవలు.




**కాట్రేనికోన పెన్ పవర్ జనవరి 27:** వారానికి ఐదు రోజుల పని దినాల డిమాండ్లతో కాట్రేనికోన మండలంలో బ్యాంకులో మూతపడ్డాయి. యూనియన్ల ఐక్యవేదిక పిలుపు మేరకు మంగళవారం సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో లావాదేవీలు నిలిచిపోయాయి. చర్చలు ఫలప్రదం కావడంతో అధికారులు నిరసన చేపట్టారు. వరస సెలవులు, సమ్మె వెరిసి బ్యాంకులకు తాళాలు పడడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# రూ.1.79 కోట్లతో కాజులూరు మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన వాసంశెట్టి సత్యం




**కాజులూరు, పెన్ పవర్, జనవరి 27:**రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి బాటను వేగవంతం చేస్తోందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం తెలిపారు. పల్లిపాలెం గ్రామంలో రూ.84 లక్షల వ్యయంతో రెండు కీలక రోడ్డు పనులు, అలాగే రూ.36 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి ఆయన మంగళవారం శంకుస్థాపన చేసి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ గ్రామీణ ప్రజల అవసరాలే కేంద్రంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని అన్నారు.రోడ్లు, వైద్య సేవలు వంటి మౌలిక వసతులు బలోపేతం అయితేనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు.అదే క్రమంలో కాజులూరు మండలం దుగ్గుదూరు గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులకు కూడా శంకుస్థాపన చేశారు.ఈ రోడ్డు పూర్తయితే గ్రామ ప్రజలకు రవాణా సమస్యలు తీరడమే కాకుండా రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు.ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, గత పాలనలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను ఇప్పుడు అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని వాసంశెట్టి సత్యం అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి జె. రాంబాబు, మండల టీడీపీ అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి (డాక్టర్ బాబు), జేఈ భవాని శంకర్, పల్లిపాలెం సర్పంచ్ వడ్డపాటి భాస్కరరావు, దుగ్గుదూరు సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి జ్యోతి కుమార్, పీఏసీఎస్ అధ్యక్షులు కె.నరసింహ మూర్తి,డీసీ చైర్మన్ చైతన్య కృష్ణ, బీజేపీ ఇన్‌చార్జ్ దూడల శంకర్నారాయణ, అంగర కృష్ణ,దడాల నాగార్జున,రాజు, రెడ్డి శేషారావు,కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రజల్లో సంక్రాంతి కనబడలేదు





## నియోజకవర్గం ఇంచార్జ్ తోట నరసింహం

**గండేపల్లి, పెన్ పవర్, జనవరి ,27:**ఈ సంవత్సరం ప్రజల్లో సంక్రాంతి కలలేదని మాజీ మంత్రి జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తోట నరసింహం అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గండేపల్లి స్థానిక వైసీపీ నాయకులు మద్ది పట్ల రామకృష్ణ స్వగృహమునందు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తోట నరసింహం హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలకు ఏదో రూపేనా డబ్బులు ఖాతాలో పడేవని తద్వారా అన్ని రోజులు ప్రజలకు ఒక పండగలా ఉండేది అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నా ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. సూపర్ సిక్స్ హిట్టు అని చెప్పుకుంటున్న కూటమి నాయకులకు పట్టు అని తెలియడం లేదని అన్నారు. ఇటీవల ఒక పత్రిక సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్యాంటు చొక్కా వేసుకున్న వాడు ప్రతివాడు నాయకుడే అన్నట్లు తోట సుబ్బారావు నేను తప్ప ఎవరు అభివృద్ధి చేయలేదని అందరూ సున్నాలేనని స్థానిక ఎమ్మెల్యే చెప్పడం ఆశాస్పదంగా ఉందన్నారు. మిగిలినవారు సున్నాలేనని లేకుంటే మట్టి మాఫియా, గ్రావిల్ మాఫియా, అక్రమ వ్యాపారాలపై చేసి ఉండేవారిమని తెలిపారు. రాజకీయంలోకి వచ్చిన దగ్గర నుండి ఎప్పుడు కూడా ప్రజాసేవకే అంకితం అయ్యావని అలాగే ప్రజలకు ఇచ్చిన మాటలను ఎన్నో నెరవేర్చడం జరిగిందన్నారు. ముఖ్యంగా డిగ్రీ కాలేజ్, బాలవరం వాటర్ ప్లాంట్, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. ఎన్నోసార్లు తెలియజేయడం జరిగిందని అధికారుల్లో ఉన్నప్పుడు వారు చేసింది ఏమిటి? మేము అధికారులు ఉన్నప్పుడు మేము ఏం చేసామో చూపిస్తామని అన్నారు.
ఉభయగోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట రాంజీ , రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం మరియు ఎంపీపీ సిహెచ్ దొరబాబు, గండేపల్లి మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల అభిమానులు పాల్గొన్నారు.

## మా మండల సమస్యలు నెరవేర్చేలా చూడండి...!

- ఎస్టీ కమిషన్ చైర్మన్ ని కలిసిన బిజెపి నేతలు




**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 27 :** మండలంలో నెలకొన్న సమస్యలను నెరవేచ్చేలా చూడండి అని ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి నీమర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి నేతలు. మంగళవారం విజయవాడలో బొజ్జి రెడ్డిని కలిసి మండలంలో ఉన్న మౌలిక సమస్యలపై ఆయనకు వివరించారు ముఖ్యంగా రోడ్లు, మంచినీటి సదుపాయం, పీఎం జన్మన్ గృహాలు అలాగే పెండింగ్ లో ఉన్నటువంటి అనేక సమస్యలపై ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అన్ని శాఖల అధికారులతో మాట్లాడి సమస్య లు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు మండల బిజెపి నేతలు రీమల చంద్రావు, అరిమెల రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

## శంబర పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్.



**గుమ్మలక్ష్మీపురం జనవరి 27 పెన్ పవర్.**సాలూరు నియోజకవర్గం మక్కువ మండలంలోని శంబర గ్రామంలో వెలసిన గిరిజనుల కొంగుబంగారం,కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ శంబర పోలమాంబ అమ్మవారిని మంగళవారం నాడు ప్రభుత్వ విప్ & కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల కూటమి నాయకులతో కలిసి అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మన్నారు తోటపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుండి తీసుకువచ్చిన సారెను ఎమ్మెల్యే శంబర పోలమాంబ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించి అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో,సమృద్ధిగా ఉండాలని ఎమ్మెల్యే. ప్రార్థించామన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కూటమి నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వేదిరేశ్వరం శివారు ములగూడెం గ్రామంలో ఘనంగా గజ్జల పూజ

## ఆకట్టుకున్న కోలాట నృత్య ప్రదర్శనలు

**రావులపాలెం పెన్ పవర్ జనవరి 27:**హిందూ ధర్మ పరిరక్షణతో పాటు సంప్రదాయ కళల ప్రచార లక్ష్యంగా కోనసీమ జిల్లా రావులపాలెం మండలం వేదిరేశ్వరం శివారు ములగూడెం గ్రామంలోని శ్రీ సీతారామ ఆలయ ప్రాంగణంలో గజ్జల పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి ఘనత చేకూర్చారు.తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో, గురువు చెల్లా శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో గత మూడు నెలలుగా సుమారు 17 మంది మహిళలు, బాలబాలికలకు కోలాట నృత్యంలో శిక్షణ అందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం, చల్లా శ్రీనివాసరావు గురువుఆధ్వర్యంలో ఈ గజ్జల పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మగణపతి రామ కోలాటం బృందం ఆధ్వర్యంలో బాలబాలికలు శ్రీ వేంకటేశ్వర స్వామి, కనకదుర్గమ్మ వేషధారణల్లో దర్శనమిచ్చి భక్తులను, కళాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నారు. గజ్జల పూజ అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ప్రేక్షకుల నుంచి అప్లాజ్ అందుకున్నాయి.భావితరాలకు హిందూ ధర్మాన్ని, భారతీయ సంప్రదాయ కళలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్నినిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా తమ పిల్లలను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.



# విద్యారంగంలో కొత్త విప్లవానికి శ్రీకారం

## మధురవాడలో 'ధనిక్ భారత్' విద్యా సంస్థల ఆవిర్భావం

**బిమిలి, పెన్ పవర్, జనవరి 27 :**భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చి దిద్దాలనే సంకల్పంతో విద్యారంగంలో సరికొత్త మార్పులకు 'ధనిక్ భారత్' విద్యా సంస్థలు శ్రీకారం చుట్టాయి. మధురవాడ కార్ షెడ్ జంక్షన్ పీ.ఎం పాలెం సమీపంలో నూత నంగా ఏర్పాటు చేసిన ఈ విద్యా సంస్థల ప్రారంభానికి సర్వం సిద్ధమైంది.ఈ సందర్భంగా నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంస్థ ప్రతినిధులు వివరాలను వెల్లడించారు. విలువలతో కూడిన విద్యే నిజ మైన సంపద అన్న భావనతో లాయిడ్ గ్రూప్ సీఎండీ, సంస్థ వ్యవస్థాపకులు విక్రం నారాయ ణరావు దూరదృష్టి, ప్రముఖ సివిల్స్ మెంటర్ బాలలత మల్లవరపు అకాడెమిక్ మార్గదర్శక త్వంలో 'ధనిక్ భారత్' రూపుదిద్దుకుందని తెలిపారు."ధనిక్ అంటే కేవలం ఆర్థిక సంపద మాత్రమే కాదు. జ్ఞానం, సాంకేతిక ప్రావీణ్యం, నైతిక విలువల సమ్మేళనమే అసలైన సంపద" అని వారు స్పష్టం చేశారు. అనుభవజ్ఞులైన అకాడెమిక్ బోర్డ్ ఈ సంస్థకు బలమైన వెన్ను ముకగా నిలుస్తుందని తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ విద్యావేత్తలు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు.సంస్థ అకా డెమిక్ బృందంలో 30 ఏళ్ల అనుభవం కలిగిన జోనల్ బ్యాచ్ మోడల్ సృష్టికర్త శ్రీ విక్రం సురేంద్ర బాబు, వేలాది మంది విద్యార్థులను ఐఐటీ, ఎన్ఐటీలకు చేరవేసిన గణిత నిపుణులు పెండే ల మస్తాన్ రావు, ఫిజిక్స్ నిపుణులు, పలు అకా డెమిక్ పుస్తకాల రచయిత కొండముడి రవీంద్ర కుమార్, ఏఐడేటా ఆధారిత అకాడెమిక్ అడ్మి నిస్ట్రేటర్ ఏ. గిరిబాబు ఉన్నారు.అలాగే ఐఐటీ ఢిల్లీ పూర్వ విద్యార్థి, టాప్ ర్యాంకుల సృష్టికర్త అంచా రాంబాబు, విద్యా పరిపాలనలో నిపుణు లు కె. సాంబశివ రావు, లైఫ్ స్కిల్స్‌వ్యక్తిత్వ వికాస నిపుణులు డా. సలీం సంస్థకు సేవలందించనున్నారు.ఇంటర్మీడియట్‌తో పాటు ఐఐ టీజేఈఈ, నీట్, యూపీఎస్సీ, పునాది తరగ తుల నిర్వహణను చేపట్టనున్నట్లు తెలిపారు. కంఠస్థం చేసే పాత విధానాలకు స్వస్తి పలికి, విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలపై దృష్టి సారించనున్నట్లు వెల్లడించా రు. తక్కువ విద్యార్థిఉపాధ్యాయ నిష్పత్తితో ప్రతి విద్యార్థికి వ్యక్తిగత మెంటార్షిప్ అందించ డంతో పాటు, మారుతున్న సాంకేతికత, ఏఐ ఆధారిత ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.202627 వి ద్యా సంవత్సరం నుంచి కార్యకలాపాలు ప్రారం భం కానున్నాయని, తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీ డియట్ విద్యకు కొత్త దిశానిర్దేశం చేయడమే తమ లక్ష్యమని సంస్థ డైరెక్టర్ బాలలత మల్లవ రపు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అజయ్ తో పాటు ఇతర డైరెక్టర్లు పాల్గొన్నారు.

## వరల్డ్ కప్‌తో పాటు 500 పైగా వికెట్లు: క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ కేన్ రిచర్డ్‌సన్ ప్రొఫెషనల్ క్రికెట్ కు గుడ్ బై చెప్పాడు. మంగళవారం (జనవరి 27) ఇంస్టాగ్రామ్ వేదికగా రిచర్డ్‌సన్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించాడు. 2009లో ఆస్ట్రేలియా జట్టులో అరంగేట్రం

చేసిన ఈ ఆసీస్ పేసర్ 17 ఏళ్ళ తర్వాత తన క్రికెట్ కెరీర్ కు వీడ్కోలు పలికాడు. ఆస్ట్రేలియా జట్టుతో పాటు బిగ్ బాష్ లీగ్ లో రిచర్డ్‌సన్ తనదైన ముద్ర వేశాడు. ముఖ్యంగా టీ20 క్రికెట్ లో ఈ ఆసీస్ పేసర్ తన మార్క్ చూపించాడు. చివరిసారిగా 2023లో ఆస్ట్రేలియా జట్టు తరపున ఆడిన రిచర్డ్‌సన్..ఈ మూడేళ్ళలో జట్టులో

స్థానం కోసం పోరాడినా ఫలితం లేకపోయింది. "ఈ బిగ్ బాష్ లీగ్ ఆడి నేను ప్రొఫెషనల్ క్రికెట్ నుండి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను. 2009లో నా అరంగేట్రం నుండి ఇప్పటివరకు ప్రతి క్షణాన్ని ఆస్వాదించాను. నా కెరీర్ ముగించడానికి ఇదే నాకు సరైన సమయం. నా కెరీర్‌ను తీర్చిదిద్దిన కోచ్‌లు, నిర్వాహకులు, తోటి ఆటగాళ్లకు ముఖ్యంగా సౌత్ ఆస్ట్రేలియాకు నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నా దేశానికి ప్రాతినిధ్యం వహించే అదృష్టం నాకు కలిగింది. ప్రపంచవ్యాప్తంగా అనేక ఫ్రాంచైజీ జట్లతో పాటు, ఆస్ట్రేలియాకు కూడా ప్రాతినిధ్యం వహించాను". అని రిచర్డ్‌సన్ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో రాశాడు.

34 ఏళ్ల రిచర్డ్‌సన్ ఆస్ట్రేలియా తరఫున 25 వన్డేలు, 36 టీ20 మ్యాచ్ ల్లో ఆడాడు. మొత్తం 84 అంతర్జాతీయ వికెట్లు పడగొట్టాడు. ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో 102 వికెట్లు.. లిస్ట్ ఎ క్రికెట్‌లో 153 వికెట్లు.. టీ20ల్లో 241 వికెట్లు తన

ఖాతాలో వేసుకున్నాడు. ఆస్ట్రేలియాలోని బిగ్ బాష్ లీగ్ లో రిచర్డ్‌సన్ వన్ ఆఫ్ ది బెస్ట్ బౌలర్ గా నిలిచాడు. 118 మ్యాచ్‌ల్లో 142 వికెట్లు తీసి టోర్నమెంట్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఐదో బౌలర్ గా తన కెరీర్ ముగించాడు. 2021 టీ20 వరల్డ్ కప్ ఆస్ట్రేలియా గెలుచుకున్నప్పుడు రిచర్డ్‌సన్ జట్టులో ఉన్నాడు.

# ఒత్తిడిలో అతడు టీమిండియాకు కీలక ప్లేయర్.. యంగ్ క్రికెటర్‌పై రోహిత్ ప్రశంసలు

**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 వరల్డ్ కప్ కు 10 రోజుల సమయం మాత్రమే ఉంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిధ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో తొలిసారి 20 జట్లు ఆడుతుండడంతో భారీ హైప్ నెలకొంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. టోర్నీ ఇండియాలోనే జరుగుతుండడంతో డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా టైటిల్ నిలబెట్టుకుంటుందని ఫ్యాన్స్ ఎంతో ఆతృత్తగా ఎదురు చూస్తున్నారు. దీనికి తోడు జట్టు సూర్య కెప్టెన్సీలోని టీమిండియా సూపర్ ఫామ్ లో ఉండడంతో అంచనాలు పెరిగిపోయాయి. జట్టు అత్యంత పటిష్టంగా ఉండడంతో పాటు గత రెండేళ్లలో తిరుగులేని విజయాలు సాధిస్తూ ముందుకు వెళ్తుంది.ఇండియాలో మ్యాచ్ విన్నర్లకు కొదువ లేదు. ఎవరికీ వారే తమదైన రోజున మ్యాచ్ ను టర్న్ చేయగలరు. అభిషేక్ శర్మ, సంజు శాంసన్ భారీ ఇన్నింగ్స్ లు ఆడగలరు. సూర్య ఎలాంటి ఆటగాడో ఇప్పటికే నిరూపించుకున్నాడు. స్వదేశంలో తిప్పేయడానికి స్పిన్నర్లు సై అంటున్నారు. పేసర్లుగా జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, హర్షిత్ రానా సూపర్ ఫామ్ లో ఉన్నారు. ఆల్ రౌండర్లు అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్య, శివమ్ దూబే నిలకడగా రాణిస్తున్నారు. భారత జట్టులో ఎంతమంది మ్యాచ్ విన్నర్లు ఉన్నప్పటికీ వరల్డ్ కప్ ముందు టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఒక బిగ్ మ్యాచ్ ప్లేయర్ ను సూచించాడు. రోడ్‌మ్యాప్'లో జతిన్ సప్రుతో మాట్లాడుతూ రోహిత్ శర్మ ఇలా అన్నాడు.."అతని కెరీర్ ఇప్పుడే ప్రారంభమైందని నాకు తెలుసు. కానీ తిలక్ బిగ్ మ్యాచ్ ప్లేయర్. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు చాలాసార్లు ఆదుకున్నాడు. మొదటసారి తిలక్ వర్మ ముంబై ఇండియన్స్ సెటప్ లో అడుగుపెట్టినప్పుడు అతనిలో ఏదో ఉందని నేను గుర్తించాను. నాతో మాట్లాడినప్పుడల్లా తిలక్ తనకు ఛాన్స్ ఇవ్వమని.. బ్యాటింగ్ ఆర్డర్ లో ముందుకు పంపితే తాను నిరూపించుకుంటానని చెప్పేవాడు. క్రికెట్ అంటే అతనికి పిచ్చి. ముఖ్యంగా ఆసియా కప్ లో పాకిస్థాన్ తో జరిగిన మ్యాచ్ లో అతని త నమ్మశక్యంగా లేదు. ఒకవైపు వికెట్లు పడుతున్నా మరోవైపు ఒత్తిడి తట్టుకొని రాణించడం చాలా కష్టం". అని



తిలక్ పై రోహిత్ ప్రశంసలు కురిపించాడు.

**ఫిట్ నెస్ సాధించని తిలక్ వర్మ:**

తిలక్ వర్మ విషయానికి వస్తే ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదు. ఇప్పటికే న్యూజిలాండ్ తో తొలి మూడు టీ20 మ్యాచ్ లకు దూరమైన తిలక్ వర్మ చివరి రెండు టీ20లకు అందుబాటులో ఉండడం లేదు. పొత్తి కడుపు సర్జరీ నుంచి కోలుకుంటున్న తిలక్ ప్లేస్‌లో శ్రేయస్ అయ్యర్‌ను బుధ, శనివారాల్లో జరిగే నాలుగో, ఐదో మ్యాచ్‌ల్లో కొనసాగిస్తున్నట్టు బీసీసీఐ సోమవారం ప్రకటించింది. 'సర్జరీ తర్వాత తిలక్ ఫిజికల్ ట్రెయినింగ్ మొదలు పెట్టాడు.
బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అతని రిహాబిలిటేషన్ సంతృప్తిగానే ఉంది. కానీ, ఫుల్ మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించేందుకు మరికొంత సమయం అవసరం. అందుకే న్యూజిలాండ్‌తో చివరి రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదు. పూర్తి ఫిట్‌నెస్ అందుకున్న తర్వాత ఫిబ్రవరి 3న ముంబైలో టీ20 వరల్డ్ కప్ వామప్ మ్యాచ్‌కు ముందు ఇండియా జట్టులో కలుస్తాడు' అని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా పేర్కొన్నారు.

## మల్హోత్రా సూపర్ సెంచరీతో టీమిండియాకు భారీ స్కోర్.. జింబాబ్వే టార్గెట్ ఎంతంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్ లో భాగంగా జింబాబ్వేతో జరిగిన మ్యాచ్ లో టీమిండియా బ్యాటింగ్ లో దుమ్ములేపింది. పసికూన జింబాబ్వే పై ప్రతాపం చూపిస్తూ భారీ స్కోర్ చేసింది. మంగళవారం (జనవరి 27) బులవాయో వేదికగా క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్ లో జరిగిన మ్యాచ్ లో విహాన్ మల్హోత్రా సెంచరీ (109)తో పాటు అభిజ్ఞాన్ కుండు (61), వైభవ్ సూర్యవంశీ (52) హాఫ్ సెంచరీలతో రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 352 పరుగులు చేసింది. 109 పరుగులు చేసిన విహాన్ మల్హోత్రా టాప్ స్కోరర్ గా నిలిచాడు. జింబాబ్వే బౌలర్లలో టటెండా చిముగోరో మూడు వికెట్లు పడగొట్టాడు. సింబరాషే ముడ్జెంగెరెరే, పనాషే మజాయ్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన ఇండియాకు తుఫాన్ ఆరంభం లభించింది. ఆరోన్ జార్జ్, వైభవ్ సూర్యవంశీ మెరుపులతో తొలి నాలుగు ఓవర్లలోనే ఒడియా 44 పరుగులు రాబట్టింది. ఉన్నంత సేపు వేగంగా ఆడిన ఆరోన్ జార్జ్ 23 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఔటయ్యాడు. అయితే సూర్యవంశీ మాత్రం మరో ఎండ్ లో తన విధ్వంసం ఆపలేదు. చూస్తుండగానే హాఫ్ సెంచరీ బాదేశాడు. రెండో వికెట్ కు మాత్రేతో కలిసి 56 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. మాత్రతో పాటు సూర్యవంశీ (52) స్వల్ప వ్యవధిలో ఔట్ కావడంతో ఇండియా 101 పరుగుల వద్ద మూడు వికెట్లు కోల్పోయింది.
వేదాంత్ త్రివేది (13) కూడా తక్కువ స్కోర్ కే ఔట్ కావడంతో ఇండియా 130 పరుగులకే నాలుగు వికెట్లు చేజార్చుకొని కష్టాల్లో పడింది. ఈ దశలో జట్టుకు ఆదుకునే బాధ్యత విహాన్ మల్హోత్రా, అభిజ్ఞాన్ కుండు తీసుకున్నారు. వీరిద్దరూ ఐదో వికెట్ కు 123 పరుగులు జోడించి జట్టును భారీ స్కోర్ దిశగా నడిపారు. హాఫ్ సెంచరీ చేసి కుండు ఔటైనా ఆ తర్వాత మల్హోత్రా మాత్రం చివరి వరకు క్రీజ్ లో ఉండి జట్టుకు భారీ స్కోర్ అందించాడు. చివర్లో ఖిలాన్ పటేల్ 12 బంతుల్లోనే 30 పరుగులు చేసి జట్టును 350 పరుగుల మార్క్ కు చేర్చాడు.



## దిశా పటానీ: ఎల్లే కవర్‌పై చంపు తోంది

# రీజనల్ మార్కెట్ లో వీళ్లకు పోటీనే లేదా?





కమర్షియల్ చిత్రాలతో రీజనల్ మార్కెట్ ఫరిదిలో సినిమాలు చేసే దర్శకులు ఎంత మంది అంటే ? ప్రముఖంగా ముగ్గురు దర్శకులు హైలైట్ అవుతారు.కమర్షియల్ చిత్రాలతో రీజనల్ మార్కెట్ ఫరిదిలో సినిమాలు చేసే దర్శకులు ఎంత మంది అంటే ? ప్రముఖంగా ముగ్గురు దర్శకులు హైలైట్ అవుతారు. వాళ్లే త్రివిక్రమ్, అనీల్ రావిపూడి, గోపీచంద్ మలినేని, బాబి కొల్లి. వీళ్లు గాక హరీష్ శంకర్, పూరి జగన్నాథ్, సురేందర్ రెడ్డి, బోయపాటి శ్రీను లాంటి వారు ఉన్నా? వీళ్లంతా ఫెయిల్యూర్స్ లో ఉన్నారు. ప్రధానంగా ఫామ్ లో ఉంది మాత్రం పై నలుగురు దర్శకులే. కొంత కాలంగా టాలీవుడ్ లో వాళ్ల చిత్రాలకు తిరుగు లేదు. ఎలాంటి సినిమాలు చేసినా కమర్షియల్ గా మంచి ఫలితాలు సాధిస్తున్నాయి.అనీల్ రావిపూడి ఇప్పటి వరకూ తొమ్మిది సినిమాలు చేసాడు. తొమ్మిది బ్లాక్ బస్టర్లు అయ్యాయి. అవేమి గొప్ప కథలు కాదు. ఎంటర్ టైనింగ్ గా ప్రేక్షకులకు కనెక్ట్ చేసి కాసుల వర్షం కురిపించాడు. రెండున్నర గంటల పాటు ప్రేక్షకులకు చక్కని వినోదాన్ని అందించాడు. ఈ విషయంలో అనీల్ కూడా ఎంతో ఓపెన్ గా ఉంటాడు. తన సామర్థ్యం హాస్యం అని దాన్ని బేస్ చేసుకుని తన ఫరిదిలో ఎంటర్ టైన్ చేస్తానన్నాడు. అలాగే కంటున్యూ అవుతాడు. తానేదో గొప్ప సినిమాలు తీసానని ఏనాడు ప్రగల్బాలు పకలేదు. అనీల్ జమానా టాలీవుడ్ లో ఇంకొంత కాలం తిరుగుండదు.ఈ జానర్లో సినిమాలు చేసే దర్శకులు అనీల్ ఒక్కడే కనిపిస్తున్నాడు. డైరెక్టర్ బాబి ట్రాక్ రికార్డు కూడా బాగుంది. -పవర్- నుంచి -డాకు మహారాజ్- వరకూ కమర్షియల్ గా మంచి విజయాలు అందించాడు. -సర్దార్ గబ్బర్ సింగ్- తప్ప మిగతా సినిమాలన్నీ మంచి విజయం సాధించినవే. చిరంజీవి, బాలయ్య, వెంకటేష్ లాంటి సీనియర్లకు బాబి అంటే ఎనలేని నమ్మకం. వారందరితో పనిచేసి విజయాలు అందించి ఆ నమ్మకాన్ని ఏర్పరుచుకున్నాడు.మాస్ కంటెంట్ ని కొత్తగా ప్రజెంట్ చేసే ప్రయత్నం చేస్తాడు. అందుకే బాబి సక్సెస్ అయ్యాడు. తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ఏర్పడింది.మరో మాస్ మసాలా డైరెక్టర్ గోపీచంద్ మలినేని కూడా బాబిలా సక్సెస్ అయిన డైరెక్టరే. కమర్షియల్ గా ఇతడి సినిమాలు మంచి విజయాలు సాధిస్తాయి. బడ్జెట్ కూడా భారీగా ఉండదు. -జాట్- సినిమాతో బాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. నార్త్ లో సైతం దర్శకుడిగా మంచి గుర్తింపు తొలి సినిమాతోనే దక్కించుకున్నాడు. ఆ సినిమాకు సీక్వెల్ చేసే ఆలోచనలో కూడా మలినేని ఉన్నాడు. సీనియర్ హీరోలు గోపీచంద్ ని రిపీట్ చేస్తున్నారంటే? కారణం సక్సెస్ ఫార్ములా తెలిసిన దర్శకుడి కావడంతోనే సాధ్యమవుతుంది. వీళ్లందరికీ కాస్త భిన్నంగా త్రివిక్రమ్ విజయాలుంటాయి. బలమైన కథ గురూజీ సినిమాల్లో హైలైట్ అవుతుంది. ఆ పాత్రలను అంతే బలంగా చెబుతాడు. అదే ఈ మాస్టర్ ప్రత్యేకత. రీజనల్ మార్కెట్ ఫరిదిలో ఈ నలుగురుకి పోటీ లేనే లేదు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 4-79, Revenue Colony, Tammireddy Palem, Kottapeta Editor : Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A3664 , e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965